# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ళ ప్రస్థానం · వార్త 30 వార్షికోత్సవం · 1996 - 2026


## యోగా కార్యక్రమానికి పోలీసు పరేడ్ గ్రౌండ్ ముస్తాబు



చిత్తూరుహెల్త్, జూన్ 7 ప్రభాతవార్త:

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే యోగా కార్యక్రమానికి చిత్తూరు ప్రశాంత్ నగర్‌లో వున్న జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్ ముస్తాబు అవుతోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు మైదానంలో మంగళవారం జిల్లా స్థాయి యోగా కార్యక్రమం నిర్వహించనుండటంతో ఈ కార్యక్రమం పక్కా నిర్వహణకు ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు మైదానంలో జరిగే జిల్లా స్థాయి యోగా నిర్వహణ ఏర్పాట్లపై డిఎంహెచ్‌ఓ తన కార్యాలయ సిబ్బందితో పోలీసు మైదానంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి డిఎంహెచ్‌ఓ కార్యాలయ అధికారులు, సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వెంకటప్రసాద్, ఎంపిహెచ్‌ఎస్ మురళీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం వ్యవహారాలు నేనే చూస్తా

- సిఎం చంద్రబాబునాయుడు
- ప్రభుత్వవిప్ కంచర్లకు రాష్ట్రస్థాయిలో అవకాశం ..
- కుప్పంలో సిఎంకు కొత్త పిఎగా శ్రీకాంత్ !!
- పార్టీ కోసం పనిచేయకుంటే మార్పులు తప్పవు..
- నేతల తీరుపై సిఎం సీరియస్ !!



కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త

తన సొంత నియోజకవర్గం కుప్పంలో పార్టీ వ్యవహారాలు ఇకపై తానే స్వయ ంగా చూస్తానని ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్ర బాబునాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఉండవల్లిలోని తమ స్వగృహంలో సిఎం చంద్రబాబునాయుడు కుప్పం తెదేపా శ్రేణులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా సిఎం మాట్లాడుతూ కుప్పంలో పనిచేస్తున్న ప్రభుత వ్విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సేవలను ఇకపై రాష్ట్రస్థాయిలో వినియోగించుకుంటామని సిఎం పేర్కొన్నట్లు సమాచారం. అలాగే కుప్పంలో తన వ్యక్తిగత కార్యదర్శిగా అనంతపురం జిల్లాకు చెందిన శ్రీకాంత్‌ను నియమిస్తున్నట్లు సిఎం ప్రకటించారని తెలిసింది. ఆయన ఇకపై కుప్పంలో ఉంటారని సిఎం పేర్కొన్నట్లు సమాచారం. సిఎంపిఏ శ్రీకాంత్ కుప్పం తెదేపా కార్యాలయంలోని జననాయకుడు పోర్టల్ కు వచ్చే అర్జీల గురించి పర్యవేక్షి స్తారని సీఎం పేర్కొన్నట్లు తెలిసింది.

### దిపనిచేయకుంటే మార్పులు తప్పవు :

కుప్పంలో పార్టీ కోసం నాయకులు పనిచేయకుంటే మార్పులు తప్పవని సిఎం చంద్రబాబునాయుడు కుప్పం నేతలను హెచ్చరించినట్లు సమాచారం. కొందరు నేతల పనితీరుపై సిఎం సీరియస్ అయ్యారని తెలిసింది.నేను చెప్పిందేంటి, మీరు చేస్తోంది ఏంటి అని ఘాటుగా వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆదేశించినట్లు తెలిసింది. స్థానిక ఎన్నికలు కూడా సమీపిస్తున్న తరుణంలో నేతలు ఇకపై కలసికట్టుగా పనిచేయాలని ఎప్పటికప్పుడు తాను పార్టీ వ్యవహారాలపై దృష్టి సారిస్తానని సిఎం పేర్కొన్నట్లు తెలిసింది. కార్యకర్తలకు నాయకులు అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలవాలని ఆదేశించినట్లు సమాచారం.ప్రభుత్వంపై ప్రజల్లో అనుకూలత పెరిగేలా చూడాల్సి న బాధ్యత ఉందని పేర్కొన్నట్లు తెలిసింది. కొన్ని క్లస్టర్లలో, యూనిట్లలో ఇన్‌చార్జ్‌లు, నాయకుల పనితీరు బాగా లేదని వీరంతా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉ ండాలని ఆదేశించినట్లు సమాచారం. యూనిట్లు, క్లస్టర్ల వారీగా ఇన్‌చార్జ్‌లు, మండల పార్టీ అధ్యక్షుల పనితీరుపై ర్యాంకులు ప్రకటించినట్లు సమాచారం. ముమ్ముందు కుప్పంలో ఎవరైనా నాయకులు పనిచేయకుంటే వారిపై వేటు తప్పదని సైతం సిఎం చంద్రబాబు స్పష్టం చేసినట్లు తెలిసింది.

# ఉత్తర చూసి ఎత్తర గంప ... పొలాల్లో వేయర గింజ ...

### తూర్పు మండలాల్లో విస్తారంగా వ్యవసాయ పనులు.. సీజన్‌కు ముందే నాట్లు పూర్తి

### యూరియా సరఫరాకు ప్రత్యేక యాప్ నేటి నుంచి ప్రారంభం

**తిరుపతి జిల్లా తూర్పు నియోజకవర్గాలైన శ్రీకాళహస్తి, సత్యవేడులలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.ఇప్పటికే సాధారణ సాగు కన్నా అధికంగానే నాట్లు వేసారు.సాధారణంగా ఈ ప్రాంతాల్లో ముందస్తు ఖరీఫ్‌లో పూర్వం వేరుశెనగ పంటను పండించే వారు. మరి కొంత కాలం వాతావరణం అనుకూలించక వాణిజ్యపంటగా చెరుకును పండించారు. కానీ ఒరెండు వాణిజ్యపంటలు రైతులకుకలసి రాలేదు.దాంతో రైతులు వరి పంటమీదనే మొగ్గు చూపారు.ఈ సారి ఒకనెల ముందుగానే రైతులు వ్యవసాయ నార్లు,నాట్లు పూర్తి చేసారు. మరో నెల రోజులుండగానే సాధారణ సాగుకన్నా అధికంగా పంటలను వేసారు.యూరియా కోసం పరుగులు తీస్తున్నారు.ప్రభుత్వం కొత్తగా యూరియా సరఫరాలో అవకతవకలకు స్వస్తి చెప్పటానికి నేడు కొత్త యాప్‌ను ప్రారంభించనుంది.**

శ్రీకాళహస్తి,జూన్ 7 ప్రభాతవార్త

ఉత్తర చూసి ఎత్తర గంప అనేది నానుడి. ముందస్తు ఖరీఫ్‌సీజన్‌లో పంటలు వేయటానికి ఉత్తర గాలి వాటం చూసి పంటలకు సిద్ధమయ్యేవారు.అయితే నేడు రైతులు ఈ విధానాలకు స్వస్తి చెప్పి సీజన్‌ను మార్చుకున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయానికి పెట్టింది పేరు ఈ నియోజకవర్గంలో చెరువులు,బోర్లు, తెలుగుగంగ నీటితో రైతులు వ్యవసాయం సాగిస్తున్నారు. ఈ ఏడాది ముందస్తు ఖరీఫ్ సీజన్ ఒక నెల ముందుగానే పూర్తి చేసారు.సాధారణంగా ముందస్తు ఖరీఫ్ సీజన్ జూన్ మూడవ వారం నుంచి ప్రారంభమయ్యేది.ఈ సారి రైతులుఒక నెల ముందుకు సీజన్‌ను జరుపుకున్నారు. భుగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. దాంతో వ్యవసాయ పనులు జోరందు కున్నాయి. శ్రీకాళహస్తి వ్యవసాయ డివిజన్‌లో ఏర్పేడు,శ్రీకాళహస్తి,తొట్టంబేడు,కెవిబిపురం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలున్నాయి. ఇక్కడ రైతులు వరి, వేరుశెనగ,సజ్జ పంటలను విస్తారంగా వేస్తారు.ఇక్కడ ముందస్తు ఖరీప్‌లో వరి పంట 8296 హెక్టార్లు సాధారణ సాగు కాగా ఇప్పటికే 9304 హెక్టార్లలో పంటలు వేసినట్లు సమాచారం.ఇంకా పదిహేను రోజులు నాట్లు ఉన్నాయి. ఇక వేరుశెనగ 983 హెక్లార్లలో సాధారణ సాగు కాగా ఇప్పటివరకు 403 హెక్లార్లలో రైతులు విత్తనం విత్తినట్లు సమాచారం. సజ్జ పంట నాటటానికి ఇంకా సమయం ఉంది. సాధారణ సాగు1303 హెక్లార్లు కాగా 538 హెక్టార్లలో నాటి నట్లు సమాచారం. ఈ ప్రాంతాల్లో మొత్తం వ్యవసాయం ఐదు మండలాల్లో 10,700 హెక్టార్లలో సాగు కాగా 10,300 హెక్టార్లలో నాట్లు పూర్తి అయ్యాయి.

**తగ్గని ఎండలు . . . జోరుగా వ్యవసాయం:**

తిరుపతి జిల్లా తూర్పు నియోజకవర్గాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సాధారణంగా ఎండలు మార్చి నుంచి మే వరకు ఉండేవి ఎల్‌నోని ప్రభావంతో ఈ ఏడాది ఇప్పటి వరకు ఎండలు తగ్గలేదు.అయితే బోర్లు,భూగర్భజలాలు పుష్కలంగా ఉండటం తెలుగుగంగ ఓ వరంగా మారటంతో రైతులు ఒకనెల ముందుగానే నార్లు,నాట్లు పూర్తి చేసారు. ప్రభుత్వం యూరియాను అధికంగా వాడవద్దని సూచిస్తూ కట్టడి చేస్తున్నా రైతులు ఇప్పటికే యూరియాకోసం ప్రయాస పడుతున్నారు. ఈ ఏడాది రైతులు ప్రభుత్వం సేకరించని 1010 రకం వరిని ఎంపిక చేసుకున్నారు. ప్రభుత్వం సేకరించకున్నా ఈ రకం దిగుబడి ఎకరాకు 40 నుంచి 45 బస్తాలు దిగుబడి వస్తుందని ఒకనెల ముందుగానే పంట చేతికొస్తే ధర బాగా పలుకుతుందనే భావంతో పరుగులు తీస్తున్నారు. ఇక వేరుశెనగ ట్యాగ్ 24



రకాలను ఎంపిక చేసుకున్నారు. పొట్టి రకాల్లో దిగుబడి అధికంగా ఉంటుందని ఎన్నుకున్నారు.

**పంటల సాగు ఆశాజనకం: ౦రైతుల్లో ఉత్సాహం: ఎడి రమేష్‌రెడ్డి**

శ్రీకాళహస్తి వ్యవసాయ డివిజన్‌లో ఈ ఏడాది ముందస్తు ఖరీస్ ఆశాజనకంగా ఉందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్‌రెడ్డి ప్రభాతవార్తకు వివరించారు.రైతులకు అవసరమైన మేరకు యూరియాను సరఫరా చేయుటకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు.ఒక ఎకరాకు మూడు బస్తాల చొప్పున అందించుటకు సిద్ధం చేసామన్నారు. ఇప్పటికే రైతులకు కార్డులు జారి చేసామని అయితే ఈ ఏడాది అక్రమాలను అరికట్టుటకు ప్రభుత్వం కొత్తయాప్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కార్డును కూడా తీసుకెళ్ళాలని సూచించారు.డీలర్ల ద్వారానే కాకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా ఽకూడా అందించుటకు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని రమేష్‌రెడ్డి సూచించారు.

### యోగ ఆరోగ్య సాధన మాత్రమే కాదు...

# ఆధ్యాత్మిక వికాసం

### -టిటిడి ఈఓ రవిచంద్ర,అదనపు ఈఓ వెంకయ్య





తిరుమల,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:

యోగ కేవలం ఆరోగ్య సాధన మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక వికాసానికి మార్గదర్శకమని టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర తెలిపారు. యోగ సాధన ద్వారా వ్యక్తి జీవితంలో సమతుల్యత, ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం (జూన్ 21) సందర్భంగా టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "యోగ-టిటిడిఆరోగ్యానంద" కార్యక్రమాన్ని ఆదివారం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ప్రారంభించారు. జూన్ 7 నుంచి 21 వరకు టీటీడీ ఉద్యోగులందరూ క్రమం తప్పకుండా యోగ సాధనలో పాల్గొనాలని సూచించారు. యోగాభ్యాసం వల్ల ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావం ఉంటుందన్నారు. ప్రారంభంలో యోగ కొంత కష్టంగా అనిపించినప్పటికీ, నిరంతర సాధన ద్వారా శరీరం, మనస్సుపై సంపూర్ణ నియంత్రణ సాధించవచ్చని చెప్పారు. మానసిక ఒత్తిడికి యోగానే ఉత్తమ పరిష్కారమని అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి తెలిపారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడులు, వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి యోగ సాధన అత్యంత అవసరమని చెప్పారు. యోగ ద్వారా భయం, ఆందోళన, ఉద్వేగాల వంటి ప్రతికూల భావోద్వేగాలను అధిగమించి మానసిక దృఢత్వాన్ని పెంపొందించేందుకు ఒక అద్భుతమైన సాధనమని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి ప్రతిరోజూ ఉదయం జరిగే యోగాభ్యాసంలో పాల్గొనాలని కోరారు. యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 18, 19, 20 తేదీలలో ఉద్యోగులకు యోగ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జూన్ 21న టిటిడి పరిపాలనా భవనంలోని పరేడ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

## ఖరీఫ్ రైతు బేజారు!

6లో



- వేరుసెనగ విత్తనం ఎక్కడ!
- జూన్ నెల ప్రారంభమైనా జాడ కన్పించని సబ్సిడీ విత్తనాలు



## తోతపురి మామిడి రైతన్న నిరాశ

### కేజీకి కేవలం రూ.3 మాత్రమే ధర

- ఖర్చులు కూడా రాక రైతుల ఆందోళన
- గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి

పులిచెర్ల, జూన్ 7, ప్రభాతవార్త

చిత్తూరు జిల్లాలో తోతపురి మామిడి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది తోతపురి మామిడి పండ్లకు మార్కెట్లో కేవలం కిలోకు రూ.3 మాత్రమే ధర లభిస్తుండటంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రస్తుతం వస్తున్న ధరలు సాగు ఖర్చులకు కూడా సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడి తోటల నిర్వహణ కోసం సీజన్ మొత్తం పిచికారీ మందులు, ఎరువులు, నీటి సరఫరా, కార్మికుల వేతనాలు తదితర ఖర్చులు భారీగా పెరిగాయని రైతులు చెబుతున్నారు. పండ్లు కోయడానికి కూలీలకు చెల్లించే వేతనాలు, పండ్లను మార్కెట్‌కు తరలించేందుకు ట్రాక్టర్లు, రవాణా ఖర్చులు కూడా అధికంగా ఉన్నాయని పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం లభిస్తున్న ధరల కారణంగా ఈ ఖర్చులు కూడా తిరిగి రావడం లేదని వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పండ్లు కోసి మార్కెట్‌కు పంపించినా వచ్చిన ఆదాయం కూలీల ఖర్చులకు కూడా సరిపోని పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. దీంతో మామిడి సాగుపై ఆధారపడిన కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి తోతపురి మామిడి పండ్లకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, అవసరమైతే ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి సారించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## దైనందిత జీవితంలో యోగా భాగం

### జాయింట్ కలెక్టర్ ఏ.రాజేంద్రన్




చిత్తూరులో నిర్వహించిన ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి ఆదర్శ్ రాజేంద్రన్, ఎమ్మెల్యే గురజాలలు

చిత్తూరు, జూన్ 7 ప్రభాతవార్త:

ప్రతి ఒక్కరు తమ దైనందిత జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం నుండి గాంధీ సర్కిల్ వరకు నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లా డుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకుని రానున్న 15 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 200 మంది ట్రైనీలను గుర్తించడం జరిగిందని, వీరి ద్వారా శిక్షణా కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో యోగా ట్రైనర్ల ద్వారా స్థానిక ప్రజలకు యోగాపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 9వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా జిల్లా స్థాయి యోగా కార్యక్రమంను నిర్వహిస్తున్నామని, ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన కాణిపాకం, పులిగుండు వద్ద థీమాటిక్ యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరు ప్రతి రోజు చేయాల్సి న అవసరం వుందన్నారు. ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు యోగా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడం ద్వారా 'ఆరోగ్య చిత్తూరు-యోగా చిత్తూరు'గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నగర పాలకసంస్థ కార్యాలయం వద్ద నుండి ప్రారంభమైన ర్యాలీ రైల్వే వంతెన మీదుగా గాంధీ సర్కిల్ వరకు సాగింది. గాంధీ సర్కిల్ వద్ద యోగాంధ్ర ప్లకార్డులు ప్రదర్శిస్తూ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి సుబ్బరాజు, నాన్ కేడర్ ఎస్పీ ఎస్‌ఆర్ రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, మాజీ మేయర్ అముద, మాజీ డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, నగరపాలకసంస్థ అధికారులు, మహిళలు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ముగుస్తున్న వేసవి సెలవులు...

### జనసంద్రంగా కాణిపాకం ఆలయం

### దర్శనానికి నాలుగు గంటల సమయం



కాణిపాకం, జూన్ 7 ప్రభాతవార్త:

పాఠశాలలు, విద్యాసంస్థలకు వేసవి సెలవులు ముగుస్తుండడంతో సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయంలో రద్దీ కొనసాగుతోంది.ఆదివారం కూడా భక్తుల రద్దీతో కాణిపాకం ఆలయం కిటకిటలాడింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు,వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది.ఈమేరకు విద్యాసంస్థలు,పాఠశాలలకు వేసవి సెలవులు మరో రెండు, మూడు రోజుల్లో ముగుస్తుండడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. ఈమేరకు గత నాలుగు రోజులుగా ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సి న పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సి న పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అలాగే ఆలయ క్యూలైన్లు వద్ద భక్తులకు దేవస్థానం తరపున ఉచితంగా మజ్జిగ, త్రాగునీరు, సాంబారు అన్నం అందించారు.దీనితో పాటు వేసవి ఉపశమన చర్యల్లో భాగంగా కూలైన్లు వద్ద కూలర్లును ఏర్పాటు చేశారు.

## రేపు సిఎం చంద్రబాబు తిరుపతి పర్యటన ..

### నేడు పి జి ఆర్ ఎస్ కార్యక్రమం రద్దు

### జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి, జూన్ 7 ప్రభాతవార్త

తిరుపతి జిల్లాలో ఈనెల 9వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఉన్నదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పే ర్కొన్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సోమవారం నాడు నిర్వహించే పి జి ఆర్ ఎస్ కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు వివిధ విధులను నిర్వహిస్తున్నందున జిల్లా వ్యాప్తంగా సోమవారం నాటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు .ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# రజకులను వెంటనే ఎస్సీజాబితాలో చేర్చాలి

## - రౌండ్ టేబుల్ సమావేశంలో రజకుల తీర్మానం

చిత్తూరురూరల్, జూన్ 7 ప్రభాతవార్త:



ఎస్సీ సాధనకై రజకులందరూ సంఘటితమై పోరాటం చేయాల్సిన అవసరం వుందని రజకసంఘాల సమాఖ్య వ్యవస్థాపక చైర్మెన్ షణ్ముగం పిలుపునిచ్చారు. ఆదివారం చిత్తూరునగరం, మురకంబట్టులో ఓ కళ్యాణమండపం నందు రాష్ట్ర రజక సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ దృష్టికి రజక సంఘాల నాయకులు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని వినతి చేయగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. అనంతరం రాష్ట్ర నాయకులు షణ్ముగం మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామిని ఇంతవరకు అమలు చేయలేదన్నారు. బిసి కులాలకు మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రకారం నాయిబ్రాహ్మణులకు దేవాదాయశాఖ పాలకవర్గాలో బోర్డు మెంబర్లుగా, చేనేత వృత్తి సంబంధించిన వారికి విద్యుత్‌రాయితీలు, సబ్సిడీలు, వడ్డెర్లకు క్వారీలలలో రిజర్వేషన్లు, గీత కార్మికులకు మద్యం షాపులు, బార్లలో రిజర్వేషన్లు కల్పించారనీ, రాష్ట్ర జనాభాలలో 6శాతం వున్న రజకులను మాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమ సమస్యలను పరిష్కరించాలని, ఎస్సీ జాబితాలో చేర్చి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో నాయకులు రాజమంత్రి నారాయణ, నాగమల్లేశ్వరరావు, వెంకటేష్, అక్కినపల్లి లక్ష్మయ్య, కాకినాడ రామారావు, సాంబశివరావు, బాలయ్య, శైలజ, రమాదేవి, పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి

పెనుమూరు, జూన్ 7 ప్రభాతవార్త:



చెరువులో పడి ఓ వ్యక్తి అనుమానస్పదంలో మృతి చెందిన సంఘటన ఆదివారం పెనుమూరు మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళితే పెనుమూరుకు సమీపంలోని పెద్ద చెరువులో ఆదివారం ఓ వ్యక్తి మృతదేహం కన్పించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చెరువులో పడి మృతి చెందిన వ్యక్తి నెల్లూరు జిల్లా నాయుడుపేటకు చెందిన రాజేష్‌రెడ్డి(45)గా పోలీసులు గుర్తించారు. గత రెండు రోజుల క్రితం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో రాజేష్‌రెడ్డి కన్పించడం లేదని కేసు నమోదైంది. ఈ క్రమంలో పెనుమూరు సమీపంలోని చెరువులో రాజేష్‌రెడ్డి మృతదేహం కన్పించడంతో ఇది ఆత్మహత్య! లేక ఎవరైనా హత్య చేసి చెరువులో పడవేశారా! అని సందేహాలు కలుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పెనుమూరు ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు విలేకరులకు వెల్లడించారు.

## వ్యర్థాల ప్రాసెసింగ్ ప్రక్రియపై అవగాహన

### - మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్

చిత్తూరు, జూన్ 7 ప్రభాతవార్త:

ఘన వ్యర్థాల నిర్వహణలో వ్యర్థాల ప్రాసెసింగ్ ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా నగరపాలక సంస్థ స్వర్ణ వార్డు పర్యావరణ పారిశుధ్య కార్యదర్శులు, మేస్త్రీలకు సంతపేట డంపింగ్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ చట్టం-2026పై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం యార్డులోని మెటీరియల్ రికవరీ, కంపోస్టు తయారీ కేంద్రం, ఫెలిసిటీలు, ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, పాత వ్యర్థాల నిర్వహణకు సంబంధించి బయోమైనింగ్ కార్యక్రమాలు, వ్యర్థాల నుండి సంపద సృష్టి, ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్ పరిశీలించారు. బయోమైనింగ్ జరుగుతున్న తీరును వారికి వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, వార్డు కార్యదర్శులు, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా దుర్యోధన వధ



గుడిపాల, జూన్ 7 ప్రభాతవార్త:

మండల పరిధిలోని పాపసముద్రం గ్రామంలో వెలసిన శ్రీద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధను వైభవంగా నిర్వహించారు. ధర్మరాజుల గుడి ఆవరణలో ఆదివారం ఉదయం 12 గంటలకు దుర్యోధనుడి ప్రతిమను భీముని వేషధారి వధించడంతో దుర్యోధన వధ ఘట్టం ముగిసింది. ధర్మరాజుల గుడి ఆవరణలో గత 18 రోజులుగా మహాభారత ఉత్సవాలు జరుగుతున్నాయి. దుర్యోధనుడి వధతో ఆదివారం ఉత్సవాలు ముగిసాయి. ఈ సందర్భంగా భాగవతారణి గీతాంజలి దుర్యోధన వధకు సంబంధించిన ఘట్టంను కథ రూపంలో వివరించారు. అనంతరం కంకణం కట్టుకున్న భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంను తిలకించడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలిరెడ్డి, మాజీ సర్పంచ్ చిట్టిబాబు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## తహశీల్దార్‌గా సూర్యప్రకాష్ నాయక్ బాధ్యతలు

వి.కోట, జూన్ 7 ప్రభాతవార్త

వి.కోట మండల నూతన తహశీల్దార్‌గా సూర్య ప్రకాష్ నాయక్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కుప్పం తహశీల్దార్ కార్యాలయంలో డిటిగా పనిచేస్తూ పదోన్నతిపై వి.కోట తహశీల్దార్‌గా నియమితులయ్యారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారంకు చర్యలు చేపడ్తామన్నారు. రీసర్వేను మండలంలో పటిష్టంగా జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మోహన్‌రెడ్డి, విఆరో ్వలు, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

## ప్రముఖ కవి, రచయిత యాకూబ్‌కు సృజనా సాహితీ పురస్కారం

పలమనేరు, జూన్ 7, ప్రభాతవార్త:



ప్రముఖ కవి, రచయిత యాకూబ్‌కు సృజనా సాహితీ పురస్కారం లభించింది. ఆదివారం స్థానిక కళామందిరంలో జరిగిన సమావేశంలో పలువురు కవులు, రచయితలు ఈ పురస్కారం అందజేశారు. ప్రముఖ కవి చరయిత పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అద్యాపకులు దివంగత శేషపిళ్ళై జ్ఞాపకార్థం యాకూబ్ ఈ పురస్కారం అందుకొని ప్రసంగించారు. జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలమనేరు రచయితల సంఘం అధ్యక్షుడుబాలాజీ, కార్యదర్శి కుమారస్వామిరెడ్డి, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సమితి అధ్యక్షుడు తులసినాథంనాయుడు, కార్యదర్శి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు. మానవీయత, మానవ సంబంధాలు చిత్రణే యాకూబ్ సాహిత్య వ్యక్తిత్వమని పలువురు కొనియాడారు. యువ కవి దోరణాల సిద్దార్థ ఆధ్వర్యంలో కవిబ సమ్మేళనం నిర్వహించారు. సర్వశిక్షా అభయాన్ జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ మద్దిపట్ల వెంకటరమణ, గంగవరం ఎంఇఓ శ్రీనివాసులు, జిల్లా నాయకులు గిరిధరమూర్తి, వీరభద్రగౌడు, కెబి ప్రణీత, వెన్నెల నాగరాజు, మోహన్‌పిళ్ళై ప్రకాష్ ,అశోక్, ఎండపల్లె భారతి, కరణం విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## 10 లక్షల తాటి మొక్కలు పంపిణీ

### - జిల్లా బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా

చిత్తూరుహెల్త్, జూన్ 7 ప్రభాతవార్త:



తాటి చెట్లు నిరాధరణకు గురవుతున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని 10 లక్షల తాటి మొక్కలను ప్రతి కుటుంబానికి పంపిణీ చేసి వారితో నాటించాలని నిర్ణయించినట్లు జిల్లా బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా అన్నారు. చిత్తూరు రూరల్ మండలం నరసింగ రాయనిపేట చెక్‌పోస్టు వద్ద ఆదివారం జిల్లా బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు తాటి చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల జీవనోపాధి పరిరక్షణకు, కులవృత్తుల ఆర్థిక సమస్యల పరిష్కారానికి తాటి చెట్ల పెంపకం ఒక మార్గంను చూపుతుందన్నారు. భారతీయ సంస్కృతిలో తాటి చెట్టును కల్పవృక్షం అంటారని, దీని నుండి కల్లు, తాటి బెల్లం, తాటి ముంజలు, గేగులు, తాటి ఆకులతో పైకప్పు, బుట్టలు, తాళపత్ర గ్రంథాల తయారీకి, చెట్టు నుండి దూలాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు రూరల్ మండల బిజెపి అధ్యక్షులు శివకుమార్, బిజెపి నాయకులు మోహన్‌నాయుడు, శివకుమార్, రెడ్డి మస్తాన్, దామోదర్ యాదవ్, కుమార్, తవమణి, రమేష్‌బాబు,సాల్మన్,ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

## నేడు కుప్పం డిఎస్పీ కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్‌డే

చిత్తూరు, జూన్ 7 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సోమవారం ఉదయం 9.30 గంటల నుండి కుప్పం డిఎస్పీ కార్యాలయంలో పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తుషార్ దూడి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఇది వరకు జిల్లా కేంద్రం చిత్తూరులోని పాత జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగేదన్నారు. అయితే ఈ సోమవారం కుప్పం డిఎస్పీ కార్యాలయంలో జరిగే పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తాను పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించివాటినిసత్వరంపరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తుషార్ దూడి తెలిపారు.

# ఘనంగా నీళ్ళకుంట గంగ జాతర





పలమనేరు, జూన్ 7, ప్రభాతవార్త:

పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని నీళ్ళ కుంటలో గంగజాతర ఘనంగా నిర్వహిం చారు. ఆదివారం ఉదయాత్పూర్వం దున్న పోతు బలిదానంతో జాతర పూర్తి చేశారు. పలమనేరులో గంగజాతర అనంతరం నీళ్ళ కుంటలో ప్రతిఏటా జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మే నెల 31న గంగచాటుతో జాతర ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. 9 రోజుల పాటు జాతర వరకు ప్రతిరోజూ మహిళలు అమ్మవారి గుడివద్ద పొంగళ్ళు పెట్టి నైవేద్యాలతో పూజలు చేశారు. ఈ నెల 6న రాత్రి అమ్మవారి శిరస్సు ఊరేగింపు జరిగింది. ఈ గ్రామంలో సుమారు వెయ్యి గృహాలు పది వీధులు ఉండగా అన్ని వీధుల్లోనూ అమ్మవారి శిరస్సు ఊరేగించారు. మేళతాళాలు, భాజా భజంత్రీలు, కోలాటములు, నయాండి డ్యాన్సులు, బుట్టిబొమ్మ లాటలు, కేరళ డ్రమ్ములు, బాణసంచా కాల్పులతో ఊరేగింపు సాగింది. రాత్రి 12 గంటలకు ప్రారం భమైన ఊరేగింపు తెల్లవారు జామున 5 గంటలకు గంగమ్మగుడి చేరుకుంది. దారిపొడువునా గృహస్తులు టెంకాయలు పగులగొట్టి పొట్టేళ్ళు, మేకపోతులు, కోళ్ళు బలి ఇచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఊరేగింపు అనంతరం అప్పటికే గంగమ్మగుడి వద్ద నిలిపిన విగ్రహంపై శిరస్సును ప్రతిష్టించారు. మహిళల మంగళహారతులు, పిండిదివ్వెలు, పసుపు కుంకుమలతో పూజలు చేసి గుమ్మడికాయ దిష్టితీసి దున్నపోతు బలిదానంతో జాతర పూర్తి చేశారు. ఈ నెల 8న తెల్లవారు జామున సమీపంలోని చెరువులో అమ్మవారి జలధి స్నానంతో జాతర ముగుస్తుంది.

### 500 మందికి అన్నదానం నిర్వహించిన ఎస్.రమేష్ బాబు

నిర్వాహకులు రమేష్ బాబు ఆధ్వర్యంలో సుమారు 500 మందికి అన్నదానం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇందుకు సంబంధించి అమ్మవారి జాతర కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించిన నిర్వాహకులు ఎస్.రమేష్ బాబు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో శనివారం శిరస్సు కార్యక్రమం నిర్వహించి ఆదివారము రాత్రి జల్ది నిర్వహిస్తామని తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



కాణిపాకం, జూన్ 7 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు చిత్తూరు గిరింపేటకు చెందిన చంద్రశేఖర్‌నాయుడు అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొతా్న్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక: కడ పి.డి

కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త



నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమంను సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10.30గంటలనుంచి మధ్యాహ్నం 1గంట దాకా ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలనుంచి సమస్యలపై నేరుగా వినతిపత్రాలు స్వీకరించడం జరుగుతుంద`న్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జిల్లా ఎస్పీచే నేడు కుప్పంలో పిజిఆర్‌ఎస్

కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త



జిల్లా ఎస్పీ తుషార్ దూడీ సోమవారం కుప్పం డిఎస్పీ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ (పిజిఆర్‌ఎస్) కార్యక్రమంను నిర్వహిస్తారని కుప్పం డిఎస్పీ పార్థసారథి తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలు ఈ మార్పును గమనించి తమ సమస్యలు, ఫిర్యాదులను జిల్లా ఎస్పీ వారికి తెలియ జేయవచ ్చన్నారు.

## ప్రజల సౌకర్యార్థం స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు



కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త

కుప్పం పట్టణం 19వ వార్డు పరిధి ప్యాలస్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో ఓం శక్ి్త ఆలయం వద్ద కౌన్సిలర్ జిమ్‌దా ము రోడ్డులో స్పీడ్ బ్రేకర్‌ను వేయిం చారు. ఈ ప్రాంతంలో వాహనదారుల నుంచి ప్రజలకు ఇబ్బందులు తలెత్తడంతో ప్రజలు విషయాన్ని తన దృష్టికి తేగా వెంటనే ఆ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుచేయించినట్లు ఆయన తెలిపారు. దీంతో స్థానిక ప్రజలు కౌన్సిలర్ జిమ్‌దాముకు కృతజ్ఞతలు తెలిపారు.

## కుప్పంలో 5కెఎం మారథాన్ విజయవంతం




కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త

కుప్పంలోని అవెంజర్స్ జిమ్ ట్రైనర్ గజేంద్ర అధ్వర్యంలో ఆదివారం 5కెఎం మారథాన్‌ను ఘనంగా నిర్వహించారు. 15-45ఏళ్ల వయసు కలిగిన 150మంది ఈ మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా ధృడత్వం కలిగి ఉండాలని అందుకు ఇలాంటి మారథాన్‌లు దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలు తిరుపతికి చెందినభగవత్‌దీప్,పవన్,తరుణ్‌లకుట్రైనర్‌గజే ంద్ర నగదుబహుమతులు, ట్రోఫీలు, మెడల్స్ అందించారు.




## ఉచిత సంతాన సాఫల్య శిబిరంకు విశేష స్పందన

కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త

స్థానిక బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆదివారం బెంగళూరు నోవా ఫెర్టిలిటీ సెంటర్ సహకారంతో నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం విజయవంతమైంది. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ హరిత మండవ, డాక్టర్ లావణ్య ఈసందర్భంగా సంతానం లేని 82మంది దంపతులకు పరీక్షలు నిర్వహించి ఐవిఎఫ్ చికిత్సకోసం 18మందిని ఎంపిక చేశారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రతినెల రెండో ఆదివారం ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహించడం జరుగుతోందన్నారు. ఐవిఎఫ్, ఐయుఐ ప్యాకేజ్‌లో తగు రాయితీలు సైతం కల్పిస్తున్నట్లు చెప్పారు. సంతానం లేని దంపతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### - కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరుహెల్త్, జూన్ 7 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు తప్పక హాజరు కావాలని ఆయన ఆదేశించారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరై ప్రజల నుండి

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ ఇంటి ముందు చెట్టు నాటాలి



శ్రీకాళహస్తి జూన్ 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ ఇంటి ముందు ఓ చెట్టు నాటాలని, దానిని భద్రంగా కాపాడాలని తెలుగు యువత నాయకుడు సత్రవాడ ప్రవీణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం హౌసింగ్‌బోర్డు కాలనీ, పానగల్,రైల్వే స్టేషన్ సమీపంలో మొక్కలు నాటారు. అలాగే ఆయన జన్మదిన సందర్భంగా పేదలకు అన్నదానం జరిపారు. రాబోవు రోజుల్లో యువత భద్రతకు, ఆరోగ్య పరి రక్షణకు రక్తదానాన్ని నిర్వహించారు.ప్రవీణ్ జన్మదిన వేడుకలను అనుచరుల మధ్య నిర్వహించారు. యువకులు వేణు సాయిలు అనుచరుల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మిట్ట కండ్రిగ వద్ద పర్యావరణాన్నికాపాడుకోవాలంటే చెట్టే ఆధారం పేరుతో సత్రవాడ ప్రవీణ్ చెట్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి యువతకు 300 మొక్కలను అందించారు. మోడల్ బ్లడ్ సెంటర్ ప్రభుత్వ సంచార రక్తనిధి, ప్రభుత్వ ఆసుపత్రి వారి సహకారం తో పానగల్ నందు వారు ఏర్పాటు చేసిన బస్సు లో 50మందిి రక్తదానం చేసారు. స్వగృహం వద్ద సత్రవాడ యువత ఆధ్వ ర్యంలో మాజీ యం.ఎల్.ఎ సత్రవాడ మునిరామయ్య, ప్రవీణ్ లను గజమాలతో సత్కరించి, భారీ కేక్ కట్ చేసారు. అనంతరం మధ్యాహ్నం పెండ్లి మండపం వద్ద ప్రవీణ్ మిత్రబృందం ఆధ్వర్యంలో అన్న దానం నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా సత్రవాడ ప్రవీణ్ మాట్లాడుతూ తన తండ్రి రాజకీయ భవిష్యత్తు గురించి విశ్లేషిస్తూ ఆయన చేసిన సేవ భాగ్యాన్ని స్మరించుకుంటూ తాను కూడా ప్రజలకు సేవలు అందించడంలో ముందుంటానన్నారు. ఈ కార్యక్రమాలలో రక్తదానం చేసిన వారు వేణుగోపాల్, సాయికుమార్, సందీప్, మునిశేఖర్, లీలమోహన్, రాజశేఖర్, ఈగప్రసాద్, కిశోర్. మణి, శంకర్ లు ఉన్నారు. ఆయనను కలిసిన వారిలో మణి నాయుడు, దావలూరు ప్రభాకర్ నాయుడు, తెలుగుదేశం పార్టీ రైతు విభాగం నాయకులు ప్రకాష్ నాయుడు, మాజీ సర్పంచ్ గాలి బాలాజీ, శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ దండి రాగవయ్య, మాజీ కౌన్సిలర్లు జయదేవన్ గిరి, ప్రసాద్ నాయుడు, దేవీమోహన్, దండి నరేంద్ర, మాజీ శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ మేళగారం సుబ్రహ్మణ్యం రెడ్డి, యం.ఐ.యం పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షులు అన్వర్ బాషా, బాల యాదవ్, తీగల బాను, బి.సి నాయకులు జయ శంకర్, బాస్కర్ గౌడ్ నియోజకవర్గం మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నిబంధనలకు విరుద్ధంగా మామిడి కొనుగోలు

**తోతాపురి చంద్రగిరిలో రూ.4, దామలచెరువు రూ.5లు**
**మామిడి రైతు యారాశి చంద్రశేఖర్ రెడ్డి**



చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త:
వరుస నష్టాలతో విలవిలలాడుతున్న మామిడి రైతుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేస్తున్నట్లు మామిడి రైతు యారాశి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్ఎంఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం మామిడి రైతులు సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా చంద్రగిరిలో తోతాపురి కిలో రూ.4లకు కొనుగోలు చేయడం దారుణమని ఆవేదన చెందారు. జిల్లా ఒకటే అయిప్పటికీ దామలచెరువులో కిలో రూ.5లకు కొనుగోలు చేస్తున్నట్లు వాపోయారు. మామిడి మండీల యజమానులు సిండికేట్ అయి రైతులకు తీరని అన్యాయం చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌ను కలసి తమకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పుల్లారెడ్డి, బోడ్రెడ్డి విజయ్‌కుమార్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, నాగిరెడ్డి, సురేష్ రెడ్డి, మురగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి కార్పొరేషన్, జూన్ 7 ప్రభాతవార్త:



ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ. సి) శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూన్ 8వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 08772227208కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలియజేశారు.

## వడదెబ్బతో ఉపాధిహామీ కూలీ మృతి

పుత్తూరు రూరల్, జూన్ 7 ప్రభాతవార్త:



వడదెబ్బకు గురై ఉపాధిహామీ కూలీ మృతి చెందిన సంఘటన ఆదివారం పుత్తూరు మండలంలో జరిగింది. మండల పరిధిలోని సిరుగురాజుపాళెం పంచాయతీ పొట్టిగుట్టలు గ్రామానికి చెందిన శంకరాచారి(41) ఉపాధి పనులుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం ఉపాధిహామీ పనులకు వెళ్లిన శంకరాచారి ఎండ దెబ్బకు తలలేక అసురుతప్పి పడిపోయాడు. దీంతో అతన్ని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించిన అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. ఇంటి వద్ద ఉండగా అపస్మారిక స్థితికి చేరుకుని ఆదివారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శంకరాచారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## లింగమనేనికి శివయ్య ప్రపాదాలు

శ్రీకాళహస్తి,జూన్ 7 ప్రభాతవార్త



రాజ్యసభ సభ్యుడుగా జనసేన పార్టీ తరఫున లింగమనేని రమేష్‌బాబు పేరును కూటమి ప్రకటించటంతో ఆయనను శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్,సభ్యుడు పగడాల మురళిలు కలసి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించారు.ఆయన నివాసంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ దేశ నిర్మాణంలో భాగస్వామ్యం పార్లమెంటు లోని ఎగువ సభలో కూర్చుని,దేశ సమగ్రతను కాపాడే చట్టాలు, నిర్ణయాలు తీసుకోవటంలో మీరు కీలక పాత్రపోషించాలని వివరించారు. కేంద్ర ప్రభుత్వంలో మన రాష్ట్రానికి సంబంధించిన హక్కులు, సమస్యలు,అభివృద్ధికి సంబంధించి చర్చించాలన్నారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలతో పాటు దుశ్శాలువతో సత్కరించారు.

## పదవ తరగతి ప్రతిభావంతుల విద్యార్థులకు ఘన సత్కారం

తిరుపతి విద్య, జూన్ 7 ప్రభాతవార్త




సమాజ సేవా లక్ష్యంతో పనిచేస్తున్న హెల్పింగ్ టు అదర్స్ సంస్థ ఆధ్వర్యంలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రమణ ప్రసాద్, టీటీడీ విద్యాశాఖాధికారి టి. వెంకట సునీలు, తిరుపతి అర్బన్ ఎంఈఓ కె. బాలాజీ చేతుల మీదుగా ప్రతిభావంతులైన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వ్యవస్థాపక అధ్యక్షులు మాణికంఠ మాట్లాడుతూ 2016లో స్థాపితమైన సంస్థ గత పది సంవత్సరాలుగా ప్రతి నెలా ఒక సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఇప్పటివరకు 125కు పైగా సేవా కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. సంస్థ పదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ, మున్సిపల్, టీటీడీ పాఠశాలల్లో పదవ తరగతిలో 560కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించినట్లు చెప్పారు.ముఖ్య అతిథులు డాక్టర్ రమణ ప్రసాద్, టి. వెంకట సునీలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. తిరుపతి అర్బన్ ఎంఈఓ బాలాజీ మాట్లాడుతూ వ్యక్తిగత వికాసానికి, సమాజాభివృద్ధికి విద్య కీలకమని పేర్కొన్నారు. టెంకాయల దామోదరం, మల్లారపు నాగార్జున మాట్లాడుతూ నిస్వార్థంగా సేవలందిస్తున్న హెల్పింగ్ టు అదర్స్ నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు, కెరీర్ గైడెన్స్, శాస్త్రీయ అవగాహన పెంపొందించే పుస్తకాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో హెల్పింగ్ టు అదర్స్ కార్యదర్శి రఘునాథ్, సభ్యులు శ్రీనివాస్, స్వాతి పావని, మధన మోహన్, హేమాద్రి, లక్ష్మీ ృపతి తదితరులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## గోగినేనిని పరామర్శించిన అంజూరు

తొట్టంబేడు, జూన్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలంలోని సీనియర్ తెలుగుదేశం నాయకుడు గోగినేని భాస్కర్‌నాయుడు ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద ఉంటున్నారు. ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పార్టీలకు అతీతంగా హాజరై పరామర్శించారు. త్వరగా కోలుకొని క్రియాశీల రాజకీయాల్లో పాల్గొనాలని కోరారు.ఆయనతో పాటు షేక్ సిరాజ్‌బాషా, ప్రసాద్, సుధీర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## యోగాన్ను జీవితంలో భాగం చేసుకోవాలి

**టీటీడీ డీఈఓ వెంకట సునీలు**

తిరుపతి విద్య, జూన్ 7 ప్రభాతవార్త



యోగాంధ్ర 26 కార్యక్రమంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానాలు జూన్ 7 నుంచి 21 వరకు నిర్వహిస్తున్న యోగ-తి.తి.దే. ఆరోగ్యానంద కార్యక్రమాన్ని పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఆదివారం యోగా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టీటీడీ విద్యాశాఖాధికారి వెంకట సునీలు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. టీటీడీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగ కార్యక్రమంలో దేవస్థాన విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.యోగ ద్వారా ఆరోగ్యం - సేవ ద్వారా ఆనందం అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం యోగ సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యవంతమైన జీవనం ద్వారా సేవలను మరింత సమర్థవంతంగా అందించవచ్చని పేర్కొన్నారు.యోగ అంటే మనసును నియంత్రించుకోవడమేనని, దీని ద్వారా ఆలోచనా విధానంలో సానుకూల మార్పులు వచ్చి మనశ్శాంతి కలుగుతుందని వివరించారు. అనంతరం ఆయన విద్యార్థులు, సిబ్బందితో కలిసి సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ప్రాణాయామం నిర్వహించారు. యోగాను కేవలం పక్షం రోజుల కార్యక్రమంగా కాకుండా జీవితంలో భాగంగా నిరంతరం ఆచరించాలని సూచించారు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో కళాశాల నుంచి మహతి ఆడిటోరియం వరకు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి. ప్రియవర్ధన బాబు, డా. సి.ఎల్. చెన్నారెడ్డి, ఎన్. వరలక్ష్మి ్మ, ఈ. లోకేష్ రెడ్డి, వి. ప్రసన్న లక్ష్మి ్మ, డా. సి. వాసుదేవులు నాయుడు, వార్డెన్ డా. ఎం. మధు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యుల ఎన్నిక ముఖ్యమంత్రి దూరదృష్టికి నిదర్శనం

**సుధీర్‌రెడ్డి**

శ్రీకాళహస్తి,జూన్ 7 ప్రభాతవార్త



రాజ్యసభకు తెలుగుదేశం పార్టీకి అహర్నిశలు మద్దతుగా ఉంటూ సేవలందించిన వారిని ఎంపిక చేయటం ముఖ్యమంత్రి దూర దృష్టికి నిదర్శనం అని శాసనసభ్యుడు సుదీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజ్యసభకు తెలుగుదేశం పార్టీ తరఫున సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లను ఎంపిక చేయటం హర్షణీయం అన్నారు.తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ప్రజాసేవకు ఆహర్నిశలు పని చేస్తున్న నాయకులను రాజ్యసభకు ఎంపిక చేసి తన రాజకీయ దూరదృష్టిని ముఖ్యమంత్రి ని అభినందించారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రజాసమస్యలపై పార్లమెంటులో ప్రస్తావించి రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తారని సుధీర్‌రెడ్డి అన్నారు.

## యోగ ద్వారా ఆరోగ్యం.. సేవ ద్వారా ఆనందం

**టీటీడీ యోగ-ఆరోగ్యానంద కార్యక్రమాలకు శ్రీకారం**

తిరుపతి విద్య, జూన్ 7 ప్రభాతవార్త




యోగాంధ్ర26 కార్యక్రమంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానాలు నిర్వహిస్తున్న యోగ-తి.తి.దే. ఆరోగ్యానంద కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జూన్ 7 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాల ద్వారా యోగా పట్ల అవగాహన పెంపొందించి ఆరోగ్యవంతమైన జీవనశైలిని ప్రోత్సహించడమే లక్ష్యంగా టీటీడీ చర్యలు చేపట్టింది.యోగ ద్వారా ఆరోగ్యం - సేవ ద్వారా ఆనందం అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో దేవస్థాన విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం యోగా సాధన, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు నిర్వహించనున్నారు.ఎస్‌వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ యోగం భారతీయ సంస్కృతికి అమూల్యమైన వారసత్వమని అన్నారు. నేటి వేగవంతమైన జీవన విధానంలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగ సాధన ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయం యోగకు కేటాయించడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి మల్లికార్జున, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

## శ్రీద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలపై చర్చ

కార్వేటినగరం,జూన్ 7 ప్రభాతవార్త:



కార్వేటినగరం శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలు గురించి చర్చించినట్లు ఆలయ అధ్యక్షులు యం.రవియాదవ్ తెలిపారు. జూలై 17వ తేది 27వ తేది వరకు శ్రీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరుగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు,ఉభయదారులు ,గ్రామపెద్దలు, ప్రజలు తీర్మానం చేయడం జరిగింది.కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రవిరెడ్డి,ప్రధానకార్యదర్శి బి.గౌతంరాజు, ఉపకార్యదర్శి సాయిరాయల్,కోశాధికారి లక్ష్మీపతి,కృష్ణయ్య, ఘటికాచలం, ధనంజ యవర్మ, యువరాజు,రంగనాథమొదలియార్,తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ విభాగంపై ప్రత్యేక ఆసక్తి

**పులివర్తి సుధారెడ్డి**

చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త:



న్యాయ విభాగంపై ప్రత్యేక ఆసక్తితో న్యాయవిద్య పూర్తి చేసి ఏఐబిఈ-21 పరీక్షకు హాజరైనట్లు పులివర్తి సుధారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కెఎంఎం కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ -21 (ఏఐబిఈ) పరీక్షకు ఆమె హాజరయ్యారు. పరీక్ష అనంతరం ఆమె మాట్లాడుతూ సామాన్య ప్రజలకు చట్టపరమైన సేవలందించడంతో పాటు న్యాయం చేసే ప్రక్రియలో తాను భాగస్వామి కావాలని ఎల్ఎల్‌బి పూర్తి చేసినట్లు తెలిపారు. ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ -21లో ఉత్తీర్ణత సాధించి సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సిఓపి) పొందడం ద్వారా దేశంలో ఏ కోర్టులోనైనా బాధితులకు న్యాయం చేయడంలో వాదించే అవకాశం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

## వైభవంగా ముగిసిన దక్షిణ కాళీ వారాహి ఆలయ అష్టబంధన మహా కుంభాభిషేకం

పుత్తూరు రూరల్, జూన్ 7 ప్రభాతవార్త:



నగరి-పుత్తూరు ప్రధాన మార్గం కణం మిట్ట వద్ద ఉన్న శ్రీ దక్షిణ కాళీ వారాహి సమేత ఉన్నంధ భైరవ ఆల యం రోడ్డు మర మ్మతులకు కారణంగా పాచికంగా తొల గించాల్సి రావడంతో నూత నంగా ఆలయ నిర్మాణానికి పూన ుకోవడం విధితమే. ఈ సందర్భంగా ఆదివారం అష్ట బంధన మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విఘ్నేశ్వర పూజ కలశస్తాపన, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆల నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూలమాల వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

## నేడు విజయపురంలో ఎన్‌టీఆర్, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ

విజయపురం, జూన్ 7 ప్రభాతవార్త:
మండల కేంద్రమైన విజయపురం పోలీస్‌స్టేషన్ ఎదురుగా సోమవారం ఉదయం 9 గంటలకు స్వర్గీయ నందమూరి తారక రామారావు, డాక్టర్‌బాబా సాహెబ్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాలను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆవిష్కరిస్తారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం 9.30 గంటలకు ఇళ్ళత్తూరు గ్రామంలోను ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ జరుగుతుందని పార్లమెంట్ అధికార ప్రతినిధి మునిభాస్కర్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ నల్లపనేని చినబాబు పాల్గొంటున్నారన్నారు. కావున తెలుగుదేశం పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అంబేద్కర్ అభిమానులు మండలంలోని వివిధ హోదాలో ఉన్న నాయకులు, కార్యకర్తలు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



కేవీబీ పురం, జూన్ 7 ప్రభాతవార్త:
కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఎంతో ఆత్మీయంగా ఒకే చోట చేరి అపూర్వ కలయికను నిర్వహించారు. ఎన్నో ఏళ్ళ అనంతరం కలుసుకున్న సహచరులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సాహాలతో మునిగిపోయారు. విద్యార్థి దశలోని మధురానుభూతులు, పాఠశాల రోజులలో జరిగిన సంఘటనలు, ఉపాధ్యాయుల బోధనలు, స్నేహ బంధాల విశేషాలను పరస్పరం పంచుకుంటూ భావోద్వేగ క్షణాలను ఆస్వాదించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తం హరిబాబు మాట్లాడుతూ పాఠశాల జీవితం మరపురాని అధ్యాయమని అన్నారు. ఆ నాటి ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణ, విలువలు, నైతిక బోధనలే నేడు తమను సమాజంలో ఉన్నత స్థానాలకు చేర్చాయని పేర్కొన్నారు. కాలం మారినా పాఠశాల జ్ఞాపకాలు, స్నేహ బంధాలు ఎప్పటికీ చెదరిపోవని అన్నారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు సాల్మన్, బుచ్చినాయుడు కండ్రిగ మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్, కేవీబీపురం ప్రధానోపాధ్యాయులు కూనాటి సురేష్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల విజయాలను చూసి ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తూ సమాజాభివృద్ధికి తమవంతు సేవలు అందించాలని సూచించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో పర్యాటకులు సందడే సందడి



వాకాడు, జూన్ 7 ప్రభాతవార్త: మండల పరిధిలోని తూపిలిపాలెం బంగాళా ఖాతం సముద్ర తీరానికి ఆదివారం నెల్లూరు, తిరుపతి జిల్లాల నుండి పర్యాటకులు తాకడితో తీరం నిండినది. ప్రతి ఆదివారం రెండు జిల్లాల నలుమూల నుండి ఈ ప్రాంతానికి వందలాది మంది తరలి వస్తుంటారు. సహజ సిద్ధంగా ఉన్న తీరం వెంబడి సరు గుడి చెట్లు, రొయ్యల యాచరీలు ప్రకృతి ప్రేమికులకు, పర్యాటకులకు ఇక్కడ తీరం ఎంతగానో ఆకట్టుకుంటుంది. అంతేకాకుండా ఇక్కడ సముద్రంలో స్నానం చేసేందుకు అనువుగా ఉండడముతో తరచూ వందలాది మంది వస్తూ ఉంటారు. ప్రస్తుతం వేసవి సెలవు దినాలు చివరి రోజుల్లో ఉండడంతో కుటుంబాలు సమేతంగా ఇక్కడ తరలివచ్చి సందడి చేశారు. తూపిలి పాలెం ప్రభుత్వ అతిథి గృహం లేక ప్రకృతి ప్రేమికులు, పర్యాటికులు కనీసం దాహార్తి తీర్చుకునేందుకు రక్షిత మంచినీరు కూడా దొరకకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలని స్థానిక నేతలు, పర్యాటకులు కోరుచున్నారు. బీచ్ కొచ్చే పర్యాటకులుకు మెరైన్ సిబ్బంది, వాకాడు పోలీస్ సిబ్బంది సముద్రం బీచ్ వద్ద ఎప్పటికప్పుడు అందుబాటులో వుంటూ పర్యాటకులకు రక్షణగా ఉన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## నెర్రి కాల్వ సమస్యకు తాత్కాలిక పరిష్కారం



సూళ్లూరుపేట, జూన్ 7 ప్రభాతవార్త: పట్టణంలో ప్రధాన సమస్యగా మారిన నెర్రి కాలువ మురుగునీటి సమస్యకు స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రత్యేక చొరవతీసుకు కోవడంతో పట్టణ ప్రజలకు తాత్కాలిక ఉపశమనం లభించింది. ఎమ్మెల్యే విజయ శ్రీ ఈ సమస్యపై స్పందించి ఇరిగేషన్ డి.ఇ కస్తూరి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, తహాశీల్దార్ శైలకుమారిలను నెర్రి కాల్వ వద్దకు పిలిపించి క్షేత్రస్థాయిలో పరిశీలించి దిగువ ప్రాంత గ్రామాల రైతులతో చర్చించారు. అనంతరం అందరికీ ఆమో దృకరంగా తాత్కాలికన మురుగునీటిని పక్కనే ఉన్న సూళ్లూరు చెరువుపక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి వదిలిపెట్టి ప్రక్రియను చేపట్టారు. పట్టణంలోని చిన్న సత్రం ప్రాంతం నుంచి శ్రీ చెంగాలమ్మ దేవస్థానం వెనుక భాగం వరకు మురుగునీటితోవెలువడుతున్న దుర్గంధం, దోమల బెడద నుంచి ప్రస్తుతానికి ఉపశమనం లభించింది. దీంతో నెర్రికాలువ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఈ చర్యలు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక పరిష్కారంతో ఈ ప్రక్రియను నిలిపివేయకుండా శాశ్వత పరిష్కారం వైపు ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ దృష్టిసారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మరుగున పడిపోయిన మాస్టర్ డ్రైనేజీ పథకానికి తిరిగి రూపు కల్పన చేయాలని కోరుతున్నారు. ఎస్‌టిపి ప్లాంటును ఏర్పాటు చేసిపట్టణ ప్రజలకు మురుగు నీటి బాధల నుండి విముక్తి కల్పించాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మోడీ 12 సంవత్సరాల పాలనపై సంబరాలు



చిట్టమూరు, జూన్ 7 ప్రభాతవార్త: భారత ప్రధాని నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పాలనపై చిట్టమూరు భాజపా ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ చిట్టమూరు మండల సమావేశం సీనియర్ నాయకులు దువ్వూరు శరత్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు పేట నరేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మోడీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ 12 సంవత్సరాల కాలంలో చేసిన పనులు గురించి చర్చి జరిపారు. ఈ నెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చేయవలసిన కార్యక్రమాల గురించి ముఖ్యంగా బూత్ స్థాయిలో బిఎల్ఎల నియామకం గురించి, శక్తి కేంద్ర ఇన్చార్జులను నియమించడం గురించి మండల శాఖ నాయకులు చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు ముద్దురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అంజూరు అంకయ్య, ఉపాధ్యక్షులు దువ్వూరు శిల్ప, అంజూరు వాసంతి, మండల కార్యదర్శి దాసరి సునీత, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు దాసరి శ్రీనివాసులు, ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి నాగూరు శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా నాయకులు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా కలప అక్రమ రవాణా !

**-పట్టించుకోని పుత్తూరు అటవీశాఖ అధికారులు**



నారాయణవనం, జూన్ 7 ప్రభాతవార్త : వృక్ష సంపదను ఎట్టి పరిస్థితిల్లోను అనుమతి లేకుండా కటింగ్ చేయడం నేరమని చట్టాలు చెబుతున్నప్పటికి వ్యాపారులు మాత్రం చట్టాన్ని తమ చుట్టంగా మలుచుకొని యద్దేచ్ఛగా కలపను రవాణా చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఎక్కడ గానీ చెట్లను నరకవద్దని చట్టాలు తెస్తున్నప్పటికి పట్టించుకోనే నాథుడు కరువయ్యారు. మండలంలో గత కొన్నేళ్లుగా వృక్ష సంపద (కలప)ను ఎలాంటి అనుమతి లేకుండా స్థానికంగాను, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నప్పటికి అడ్డుకోవాల్సిన పుత్తూరు అటవీశాఖ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వాల్టా చట్టం ప్రకారం చెట్లను నరికివేయడం నేరం. అయినా వ్యాపారులు, ఇటుక బట్టీ వ్యాపారం చేసే వ్యక్తులు పొలాల్లో, అడవుల్లో పెరిగిన తైలం, వేప, చింతచెట్టుతో మిగిలిన ఎన్నో రకాలైనటువంటి విలువలను వృక్షాలను నరికి తీసుకెళ్తూతున్నారు. పొలాల్లో రైతులు పెంచుకున్న చెట్లను నరకడానికి కూడా తప్పకుండా ప్రభుత్వ అనుమతి తప్పని సరి. అయినా ఎలాంటి అనుమతిని తీసుకోకుండా కొనుగోళు చేసిన రైతులు కటింగ్ చేసి తరలిస్తున్నారు. క్రింది స్థాయిలో ఎవరైనా ప్రశ్నిస్తే కమీషన్ కొట్టి కలపను తీసుకెళ్లిపోతున్నారు. అంతేకాకుండా అడవుల్లోకి కూలీ మనుషులను తీసుకెళ్లి కలపను కొట్టి తీసుకెళ్తున్నారు. ఇక ్కడ నుంచి తరలించే కలపను పుత్తూరు, నగరితో పాటు ఇటుక బట్టీ వ్యాపారులకు తరలిస్తున్నారు. రైతుల వద్ద తక్కువ ధరలకు కొనుగోళు చేసిన కలపను మూడింతల ఆదాయానికి అమ్ముకొని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కలప అక్రమ రవాణాన్ని అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులే అక్రమాలకు పాల్పడడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికైనా సంబందిత జిల్లా అధికారులు స్పందించి వెంటనే కలప అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గ్యాస్ ధరలు తగ్గించాలని 9న ఆందోళన



బాలాయపల్లి, జూన్ 7 ప్రభాతవార్త: పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న రాస్తారోకో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక డాక్టర్ కాలప్ప కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వరుసగా పెంచుతున్న పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల కారణంగా సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీలు చేపట్టిన ఆందోళనల్లో భాగంగా జూన్ 9న రాస్తారోకో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వి.రమణయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి డి. శివకుమార్, రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహాభారతం చివరిఘట్టం దుర్యోధన వధ



చిన్నగొట్టిగల్లు, జూన్7 ప్రభాతవార్త: చిన్న గొట్టిగల్లు మండలం ఎడమ వారి పల్లెలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆఖరి ఘట్టం దుర్యోధన వధ ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది కురుక్షేత్ర యుద్ధములో కౌరవ సైన్యం పూర్తిగా నాశనం అయ్యింది దుర్యోధనుడు పారిపోయి ద్వైపాయన సరస్సులో దాక్కొని ఉండగా అతని జాడ కనిపెట్టి బయటికి రప్పించే సన్నివేశం ఆకట్టుకున్నది భీమ దుర్యోధనల మధ్య యుద్ధం జరుగుతుండగా శ్రీకృష్ణుడు దుర్యోధనుని తొడపై కొట్టమని భీముడుకు సంకేతం ఇవ్వగా భీముడు దుర్యోధనుని తొడపై కొట్టడంతో కూలి పోయి మరణించాడు దీంతో మహాభారతం యుద్ధంముగుస్తుంది అనంతరం రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు

## ఇక నుంచి ఏపి ఎయిమ్స్ యాప్ ద్వారా యూరియా

**నేటి నుంచి యాప్ సేవలు**



శ్రీకాళహస్తి,జూన్ 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానంతోనే పరిపాలన సాగించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ రంగంలో కూడా వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారు. రైతులకు ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు సక్రమంగా అవినీతి ఆరోపణలకు అవకాశం లేకుండా ఉండాలని కొత్త యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ సోమవారం నుంచి అమలులోకి వస్తుంది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్‌రెడ్డి ఆదివారం ప్రభాతవార్తతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి వ్యవసాయశాఖ సబ్‌డివిజన్లో రైతులకు ఎకరాకు మూడు బస్తాలు చొప్పున యూరియా అందించనున్నట్లు వివరించారు.అయితే సోమవారం నుంచి ప్రభుత్వం కొత్త యాప్‌ను రూపొందించి అమలు చేస్తుందన్నారు. అయితే శ్రీకాళహస్తి పరిధిలో ఇప్పటికే రైతులకు కార్డులను జారి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం యూరియా తీసుకునేందుకు కార్డుతో పాటు యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. యూరియా,డిఏపిలు పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఎరువుల విక్రయాల కోసం ప్రభుత్వం 'ఆంధ్ర ప్రదేశ్ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ యాప్‌ను రూపొందించి అమలులోకి తీసుకొచ్చిందన్నారు.ఈ మేరకు వ్యవసాయశాఖ కమిషనర్ తమకు వీడియో కాన్ఫరెన్సు ద్వారా శిక్షణ ఇచ్చారన్నారు. పంటలను సాగుచేస్తున్న ప్రతి రైతుకు ఈ యాప్ ద్వారా యూరియా డిఏపిలను అవసరం మేరకు లభ్యత ఉంటుందన్నారు. రైతులు తమకు ఇష్టమైన ప్రాంతంలోని విక్రయ కేంద్రాల నుంచి ఎరువులు తీసుకునే వెసులుబాటును రమేష్‌రెడ్డి వివరించారు. వారి మొబైల్ నెంబర్‌కు సమాచారం వస్తుందన్నారు. ఈ మేరకు రైతు తనకు ఎక్కడైతే ఇష్టముంటుందో అక్కడ తీసుకోవచ్చునని రమేష్‌రెడ్డి తెలిపారు. సాగు చేసే ప్రతి రైతుకు ఒక్కొక్క సీజన్‌లో 50 బస్తాల ఎరువులు అందేలా యాప్‌ను రూపకల్పన చేసినట్లు వివరించారు.ఏ రైతు ఎంత విస్తీర్ణంలో పంట వేశారో ఏ పంటకు ఏ ఎరువు ఎంత వాడాలో వివరిస్తుంది.ఈ యాప్ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

## మహిళ మెడలో గొలుసు అపహరణ



బాలాయపల్లి, జూన్ 7 ప్రభాతవార్త: మండలంలోని మేల్చూరు గ్రామానికి చెందిన కాసారం కృష్ణమ్మ మెడలోని బంగారు గుర్తుతెలియని వ్యక్తులు బైక్ పై వచ్చి లాక్కొని వెళ్లారు. కృష్ణమ్మ మేల్చూరు గ్రామంలో చిల్లర దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తోంది. కృష్ణమ్మ కేకలు వేసిన బైక్‌పై వచ్చిన దుండగులు లెక్కచేయకుండా బలవంతంగా బంగారు వస్తువులను దోచుకుని వెళ్లారు. చెవిలోని మూడు గ్రాముల కమ్మలను కూడా దుండగలో బలవంతంగా లాక్కొని వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థినిని సత్కరించిన బ్రాహ్మణ సంఘం



బాలాయపల్లి, జూన్ 7 ప్రభాతవార్త: ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన చెంబూరు సాయి ప్రణతిని బ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. సాయి ప్రణతి అత్యధిక మార్కులు సాధించడంతో విద్యార్థినిని తిరుచానూరులో జరిగిన బ్రాహ్మణ సంఘం సమావేశాల్లో మెమెంటు అందజేసి సత్కరించారు. ప్రోత్సాహ బహుమతిని కూడా విద్యార్థినికి అందించారు. విద్యతోనే అందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బ్రాహ్మణ సంఘం నాయకులు ఈ సందర్భంగా అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం ద్వారా పేద విద్యార్థులకు తగు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

## ముక్కంటీశుని ఆలయం...శివనామస్మరణతో పునీతం

**రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు**

శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిట కిట లాడింది. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. ఆన్ లైన్ కష్టాలు చోటు చేసుకుంటున్నా భక్తులు తిప్పలు పడుతూ స్వామి అమ్మవార్ల దర్శనాలకు హాజరయ్యారు.




రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి.ఇటీవల కాలంలో శ్రీకాళహస్తీశ్వరాలయం లో భక్తుల రద్దీ పెరిగింది. ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.ఆదివారం ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరోవైపు అతిధులతో కళ కళ లాడింది.

**అనూహ్యంగా పెరిగిన రద్దీ:**

నాలుగైదు రోజులుగా పరిమితంగా ఉన్న భక్తుల సంఖ్య ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు.

**శివానందైక నిలయం జనంతో కిట కిట:**

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శివానందైక నిలయం భక్తులతో కిట కిట లాడింది. దక్షిణ కైలాసంలో వెలసిన వాయులింగేశ్వరుడు భక్తులు తమ ఇష్టదైవం ముక్కంటీశునికి దర్శించుకొని శుభాలు పొందాలని పరుగులు తీశారు. ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిధుల తాకిడితో ఆలయం కిట కిట లాడింది. అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. అయితే వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఇఓ బికె వెంకటేశులు ఆదేశాలతో వారి సిబ్బంది పరుగులు తీసారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం అవుతుండటంతో సమీపంలోని ఆలయాల దర్శనానికి రద్దీ ఏర్పడింది. ఒక్కసారిగా జనం తండోపతండాలుగా కదలి తరంగాల్లా కదలి వచ్చారు. రెండు రోజులుగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ అధికమైంది. ఏ లాడ్జిలో చూసినా ఏ హోటల్‌లో పరిశీలించినా, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో చూసినా జనమే జనం. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్,వెంకటస్వామి,ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ వారి సహాచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**నామమాత్రంగా మారిన నిబంధనలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు ఆలయంలో రోజుకొక నిబంధనలతో సతమతమౌతున్నారు.ఇక్కడ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలుల మొక్కుబడిగా మారాయి. నిబంధనలు రూపకల్పన చేసిన అధికారులు వాటి ఆచరణలో ఎందుకో కఠినంగా వ్యవహారించలేకపోతున్నారు.ముఖ్యంగా అంతరాలయ దర్శనానికి ఆంక్షలు. సెల్‌ఫోన్లు తీసుకురాకూడదనే నిబంధనలతో ఇక్కట్లు పడ్డారు. పిఆర్‌ఓ కార్యాలయం నుంచి కొందరు విఐపిల ముసుగులో అంతరాలయ దర్శనానికి తీసుకెళ్ళటంతో భక్తుల్లో అసహనం చోటు చేసుకుంది. దేవుని ముందు అందరూ సమానులే అంటారు.కానీ శ్రీకాళహస్తీశ్వరాలయంలో 'పలుకుబడికే' పెద్ద పీట అన్నట్లుమారింది. ఇక్కడ చట్టాలు కొందరికి చుట్టాలుగామారి కనకవర్షం కురిపిస్తుంది.ఇక కొన్ని గేట్ల వద్ద సెక్యూరిటి సిబ్బందియేదళారుల అవతారమెత్తుతున్నారు. దిశ దెశ నిర్దేశం లేని నిబంధనలతో స్వామి అమ్మవార్ల ఆలయాల వద్ద ఉన్న సిబ్బంది ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

## డ్రగ్ డిటెక్షన్ కిట్స్ ద్వారా 70 మందికి పరీక్షలు

**- 20 ప్రాంతాల్లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్**



చిత్తూరు, జూన్ 7 ప్రభాతవార్త: మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అమ్మకాలు, వినియో గాలను కట్టడి చేయడం, సమా జంలో ఆసాంఘీక కార్యక్రమా లను నియంత్రించ డానికి ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు నాన్ కేడర్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు ఆధ్వర్య ంలో పోలీసులు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు జిల్లా వ్యాప్తంగా మొత్తం 20 ప్రాంతాల్లో రౌడీషీటర్లు, గంజాయి కేసుల్లో గతంలో పట్టుబడిన నిందితులు, అనుమానిత వ్యక్తుల నివాసాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అలాగే డ్రగ్ డిటెక్షన్ కిట్స్ సహాయంతో 70 మందికి గుర్తింపు పరీక్షలు నిర్వహించగా చిత్తూరు తాలుకా, యాదమరి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఐదు మంది వ్యక్తులు మాదకద్రవ్యావలను వినియోగించినట్లు పాజిటివ్ రిపోర్టులు వచ్చాయి. కార్వేటినగరం కొత్తవీడు గోపిశెట్టిపల్లిలో ఎస్ఐ తేజస్విని నిర్వహించిన దాడుల్లో 450 లీటర్ల సారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేయడం జరిగింది. చిత్తూరు వన్, టుటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 20మంది రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడవద్దని, నేరాలకు దూరంగా వుండాలని పోలీసులు హెచ్చరించారు.

## తెలుగు గంగ కాలువలో యువకుడు గల్లంతు !



బాలాయపల్లి, జూన్ 7 ప్రభాతవార్త : మండలంలోని ఊట్లపల్లి సమీపంలో ఉన్న తెలుగు గంగ కాలువలో యువకుడు గల్లంతైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మేల్చూరు గ్రామానికి కంటిపల్లి లేట్ మాతయ్య మస్తానయ్య కుమారుడు కంటిపల్లి గణేష్ (21) వారి స్నేహితుడు చంద్రశేఖర్ కలసి తెలుగు గంగ కాలవలో ఈత కొడుతుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. బాలాయపల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

## రెండేళ్ల కూటమి పాలన విజయగాధకు సాక్ష్యం

**-దామినేడు వేదికగా మహా విజయోత్సవ సభకు ఏర్పాట్లు**



తిరుపతిరూరల్, జూన్ 7 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు ప్రజల మధ్య ఘనంగా చాటిచెప్పేందుకు దామినేడు వద్ద నిర్వహించనున్న విజయోత్సవ సభను విజయవంతం చేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పిలుపునిచ్చారు. ఈ సభ చారిత్రాత్మకంగా నిలిపేందుకు అన్ని స్థాయిల్లో విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ఆదివారం సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే నాని స్వయంగా పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఆర్డిఓ రామ్మోహన్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులతో కలిసి భద్రత, పార్కింగ్, రవాణా, ప్రజల సౌకర్యాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రతి అంశాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తూ ఎలాంటి లోపాలు లేకుండా సభ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్ధేశం చేశారు. ఈ విజయోత్సవ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలక ఘట్టంగా నిలిచే ఈ సభకు భారీగా జనసందోహం తరలివచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే వేదికగా ఈసభ నిలవాలని, ప్రతి కార్యకర్త, నాయకుడు దీన్ని విజయవంతం చేయడంలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. దామినేడు వేదికగా జరగనున్న ఈ మహాసభతో చంద్రగిరి నియోజకవర్గం మరోసారి రాష్ట్ర దృష్టిని ఆకర్షించనున్నదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## నరేంద్ర మోడీజీ సుపరిపాలనకు 12 ఏళ్ల



తడ, జూన్ 7 ప్రభాతవార్త : .భారతదేశంలో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ అమ్మ పేరుతో మొక్క నాటే కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పిలుపు నిచ్చింది అందులో భాగంగా తడ మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు చిల్లకూరు తేజ రెడ్డి ఆధ్వర్యంలో నరేంద్ర మోడీజీ పరిపాలన 12 ఏళ్లయిన సందర్భంగా మొక్కలు నాటారు అదే విధంగా మండల స్థాయి బిజెపి నాయకులు సమావేశమ య్యారు స్థానిక ఎన్నికల్లో గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు తడ మండల బిజెపి అధ్యక్షులు చిల్లకూరు తేజ రెడ్డి, బిజెపి జిల్లా ఓబీసీ అధ్యక్షులు గోపి ఆచారి, రమేష్, పురుషోత్తం రెడ్డి, దయాలన్, చెంగయ్య, రాంకీ, మనోజ్,మునస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు

వాకాడు, జూన్ 7 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 8వ తేదిన సోమవారం జరగాల్సిన పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు తహాశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో ఈ నెల 09వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారన్నారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు వివిధ విధులను నిర్వహిస్తున్నందున జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పరిశోధక విద్యార్థుల పట్ల నిరక్ష్యం?



తిరుపతి విద్య, జూన్ 7 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం కాన్వొకేషన్ ఆహ్వాన పత్రికలో రీసెర్చ్ స్కాలర్స్‌కు ప్రాతినిధ్యం కల్పించకపోవడంపై పరిశోధక విద్యార్థులు, భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయ ర్యాంకింగ్స్, పరిశోధనల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న తమను పూర్తిగా విస్మరించడం అన్యాయమని వారు పేర్కొన్నారు.జూన్ 10న జరగనున్న కాన్వొకేషన్‌కు సంబంధించి విడుదల చేసిన ఆహ్వాన పత్రికలో అధికారులు, అధ్యాపకులు, వివిధ వర్గాల ప్రతినిధులకు స్థానం కల్పించినప్పటికీ, పరిశోధక విద్యార్థుల ప్రస్తావన లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ స్కాలర్స్ కేవలం పరిశోధన కార్యకలాపాలకే పరిమితం కాకుండా, బోధన, ప్రాక్టికల్స్ నిర్వహణ, పరీక్షల ప్రక్రియలో సహకారం, విద్యార్థుల ప్రాజెక్టులకు మార్గదర్శకత్వం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. రాబోయే కార్యక్రమాల్లో పరిశోధక విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కల్పించి, వారి సేవలకు తగిన గౌరవం ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి. అశోక్ కుమార్‌తో పాటు రీసెర్చ్ స్కాలర్స్ డిమాండ్ చేశారు.

# తిరుపతి డివిజన్

## కోడూరు కళాకారులు ఎస్పీ బాలు స్థాయికి ఎదగాలి :: కళాశ్రీ పంతగాని

రైల్వేకోడూరు రూరల్, జూన్ 7 ప్రభాతవార్త



రైల్వేకోడూరు కళాకారులు కీర్తిశేషులు ఎస్పీ బాలసుబ్రమణ్యం స్థాయికి ఎదిగి రాణించాలని రైల్వే కోడూరు టిడిపి యువ నాయకులు రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు కళాశ్రీ పంతగాని నరసింహ ప్రసాద్ అన్నారు. ఆదివారం రైల్వే కోడూరు పట్టణంలోని తులసీరామ్ కళ్యాణ మండపంలో భాను ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో ప్రత్యేక ఎస్పీ బాలసుబ్రమణ్యం 80వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 30 మంది కి పైగా కళాకారులు సప్త స్వరాలతో పాల్గొన్స వారిని ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఆర్కెస్ట్రా ఏర్పాటు చేసిన పాటలలో ఎస్పీ బాలసుబ్రమణ్యం కు సంబంధించిన పాటలను కళాకారులు ఏకధాటిగా ఆలాపించారు. ఆదేవిధంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన పంతగాని నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఇంతమంది పాటల కళాకారులు ఉన్నందుకే మనసు ఎంతో చెల్లించిపోయిందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రైల్వేకోడూరు కళాకారులు కోసం ప్రత్యేక ట్రస్ట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ద్వారా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని అదేవిధంగా కళాకారులకు పెన్షన్ కూడా మంజూరు చేసే విధంగా స్థాయి శక్తుల కష్టపడతానని ఆయన అన్నారు. అనంతరం పాటలు పాడిన కళాకారులకు పంతగాని నరసింహ ప్రసాద్ ద్వారా మెమెంటోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాధాకృష్ణ, పాటలు పాడిన కళాకారులు కస్తూర్తి వాసుదేవ, మెరుసు నరసింహులు, రెడ్డి ప్రసాద్, అరుణదేవి, మోడీ సుబ్బరాయుడు, సుబ్బలక్ష్మి, విజయ్, సంజీవ రాయుడు, రోజా రాణి, సుమీల్, అపురూప సౌందర్య తోపాటు కళాకారులు పాల్గొన్నారు. కళాకారులచే భాను ఆర్కెస్ట్రా అధినేత తిరుపాల పంతగాని నరసింహ ప్రసాద్ ను ఘనంగా సన్మానించారు.

## ఘనంగా ముగిసిన శ్రీ ఓసూరమ్మ తిరుణాల





చిట్వేలి, జూన్ 7,ప్రభాతవార్త:

చిట్వేలి మండల పరిధిలోని మైలపల్లి రహదారి వద్ద వెలసి ఉన్న గ్రామదేవత శ్రీ ఓసూరు ఎల్లమ్మ తిరుణాల మహోత్సవం ఆదివారంతో ఘనంగా ముగిసింది. శుక్రవారం మొదలు మూడు రోజులు పాటు మండల పరిధిలోని మైలపల్లి పంచాయతీలోని రాచపల్లి, మైలపల్లి, అరుంధతివాడ, వడ్డిపల్లి, గొల్లపల్లి, నడింపల్లి, బట్టువారిపల్లి ఏడు గ్రామాలలో బంధువులతో పండుగ వాతావరణం నెలకొన్నది. శుక్రవారం ఎం రాచపల్లి గ్రామం నుంచి అమ్మవారిని శనివారం సాయంత్రం వరకు మిగిలిన గ్రామాలలో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవంలో రాజమండ్రి కళాకారుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువత పోటీపడి అమ్మవారిని తలపై మోపుకుని తప్పెట దరువుకు నృత్యం చేశారు. శనివారం సాయంత్రం ఊరేగింపు తదుపరి అమ్మవారు ప్రధాన ఆలయంలో కొలువు తీరారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు. జంతుబలులు, పొంగళ్లతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. శనివారం రాత్రి ఆర్కెస్ట్రా, ఆదివారం చెక్కభజనలు, అన్నదానాలను కమిటీ పెద్దలు పెద్ద ఎత్తున నిర్వహించారు. వృషభ రాజులను అలంకరించిన పందారపు బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ, స్థానిక ఎస్సై వినోద్ కుమార్ తమ సిబ్బందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

## ఘనంగా కొరముట్ల జన్మదిన వేడుకలు.

రైల్వేకోడూరు అర్బన్, జూన్ 7 ప్రభాతవార్త




వైఎస్ఆర్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కోడూరు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆయన జన్మదిన సందర్భంగా కోడూరు నియోజకవర్గంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, బంధువులు జన్మదిన వేడుకలు జరిపేందుకు వైస్సార్ పార్టీ కార్యాలయమ్ లో సుమారు వంద కిలోల కేక్ ను ఏర్పాటు చేసి, కొరముట్ల శ్రీనివాసులు అయన కుటుంబ సభ్యులను ఆహ్వానించారు. జన్మదిన సందర్బంగా ఆదివారం తెల్లవారుజామున రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే, వైస్సార్ సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి కోరాముట్ల శ్రీనివాసులు కుటుంబ సమేతంగా తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని, పార్టీ శ్రేణుల ఆహ్వానం మేరకు రైల్వే కోడూరు లోని వైసీపీ పార్టీ కార్యాలయం లో అభిమానులు, పార్టీ కార్యకర్తలు నియోజకవర్గ స్థాయి నాయకులు ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల కార్యక్రమంకు కుటుంబ సామెతంగా హాజరుయ్యారు. ఈ సందర్భంగా కోరముట్ల శ్రీనివాసులు 100కిలోల కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులు అభిమానుల మధ్య ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

## ఓటరు జాబితా సవరణపై టీడీపీ శ్రేణులకు దిశానిర్దేశం

– సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కూరపాటి శంకర్ రెడ్డి పిలుపు

వరదయ్యపాలెం, జూన్ 7, ప్రభాతవార్త



ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్)ను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా అర్హులైన ప్రతి ఓటరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు సర్ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు వరదయ్యపాలెంలోని కెబిజి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర అంశాలపై అబ్జర్వర్ మలిశెట్టి వెంకటేశ్వర్లు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా కూరపాటి శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రక్రియపై పార్టీ శ్రేణులు పూర్తి అవగాహన కలిగి ప్రజలకు సహకరించాలని సూచించారు. క్లస్టర్ ఇన్‌చార్జీలు, కోక్లస్టర్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు, కోయూనిట్ ఇన్‌చార్జీలు, ఐటీడీపీ ప్రతినిధులు, క్లస్టర్ టెక్నికల్ ఇన్‌చార్జీలు సర్ ప్రక్రియను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, అర్హులైన ఓటర్ల వివరాలు నమోదు అయ్యేలా కృషి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు బాధ్యతగా తీసుకుని అనర్హులు మరియు నకిలీ ఓట్లు తొలగించే ప్రయత్నంలో భాగంగా మరణించిన వారు, వలస వెళ్ళిపోయిన వారు, డూప్లికేట్ ఓట్లు తొలగించి ఎటువంటి అక్రమాలకు తవులేకుండా సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కూరపాటి శంకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు స్థానిక వరదయ్యపాలెం మండల అధ్యక్షులు పి.యుగంధర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్‌లు పి, నిర్మల్ కుమార్, పరుచూరి మల్లికార్జున్, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణ యువతలో క్రీడాస్ఫూర్తి పెంచాలి: రావిళ్ళ

తొట్టంబేడు, జూన్ 7 ప్రభాతవార్త



గ్రామీణ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంచుటకు స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఎన్నో ప్రణాళికలను సదుపాయాలను కల్పిస్తున్నారని వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు పిలుపు నిచ్చారు. మండలంలోని చిలకావారి కండ్రిగలో ఆదివారం సివికె క్రికెట్ టోర్నమెంట్ సీజన్ 2 ఫైనల్ పోటీలకు ఆయన ముఖ్యఅతిదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ నేడు కూటమి ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి యువతను క్రీడాపరంగా తీర్చి దిద్దుటకు పాఠశాల స్థాయి నుంచి క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతి యువకుడు తన అభిరుచి మేరకు ఎంపిక చేసుకొని సాధన చేయాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు దేహాధారుద్యం పెరుగుతుందన్నారు. శ్రీకాళహస్తిలో క్రీడాకారులను ప్రోత్సహించుటకు విద్యా ప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో చక్కటి మైదానంతో పాటు స్పోర్ట్స్ భవనాన్ని నిర్మించినట్లు వివరించారు. ఇలాంటి టోర్నమెంట్లు యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచుతాయని వివరించారు. ఈ సందర్భంగా విన్నర్స్‌కు రూ.10వేలు నగదు బహుమతితో పాటు మెమెంటోను అందించారు. అలాగే రన్నర్‌అప్ టీంకు రూ.5వేలు నగదుతో పాటు ధృవీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో ఎజిపి కమల్‌కుమార్, తొట్టంబేడు సింగిల్ విండో సహకార బ్యాంకుచైర్మెన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి, వెంకటేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓబిసిలుగా గుర్తించండి

–తిరుపతిలో మొదలియార్ కార్పొరేషన్ నేతలు

తిరుపతి, జూన్ 7ప్రభాతవార్త:




దేశంలోని మొదలియార్‌లను బిసి జాబితా నుండి తొలగించి ఓబిసిలుగా గుర్తించాలని రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ బోర్డు కోరింది. మొదలియార్ కులస్తుల సమస్య, కేంద్రం బిసి జాబితాలో ఓబిసి గా గుర్తింపు ఇవ్వాలని, యువత కు ఉపాధి అవకాశం ఇవ్వాలని తీర్మానం చేసి బిసి కమిషన్ కు సిపారస్సు చేశారు. ఆదివారం రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ బోర్డు సమావేశం జరిగింది. చైర్మన్ త్యాగరాజన్ అధ్యక్షతన నిర్వహించి వచ్చే నెల నుండి రాష్ట్ర వ్యాప్తంగా మొదలియార్ సంఘం సమావేశాలు అన్ని నియోజకవర్గం లో నిర్వహించి సంఘం అభివృద్ధి కి కృషి చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమం లో కుప్పం నియోజకవర్గం బోర్డు డైరెక్టర్ లు వినోద్, చెక్కునత్తం మణి పాల్గొన్నారు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం.

తిరుపతి, జూన్ 7ప్రభాతవార్త:



మార్కెట్ మునిరామీ రెడ్డి ఆధ్వర్యంలో గోవింద రాజ స్వామి ఆర్ట్స్ కళాశాల 1992-9 5బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం తిరుపతిలో జరిగింది. 30సం తరవాత సంతోషముగా కలవడం వారి యోగక్షేమాలు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూజారి గోపినాథ్ రెడ్డి, లక్ష్మీ ్మపతి విజయసారధి, రఘు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రసాయన రహిత వ్యవసాయంపై జాతీయ సదస్సు

తిరుపతి, జూన్ 7ప్రభాతవార్త:



సుభాష్‌పాలేకర్ కృషితో తిరుపతిలో ఐదురోజుల జాతీయసదస్సు జరగనుంది. 11వతేదీ నుండి 15వరకు జరిగే ఈ సదస్సుకు రసాయన రహిత వ్యవసాయం సాగిస్తున్న రైతులు, కమిటీ సభ్యులు పాల్గోనాలి. తిరుపతి భూలక్ష్మి, ఆక్రాన్, వర్డ్, రైతునేస్తం, సేవ్ స్వచ్చంద సేవాసంస్థలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఎస్వీయూ ఆడిటోరియంలో జరిగే ఈ సదస్సుకు హాజరుకాగోరేవారు 9849059573,8919233929,9705383666నంబర్లకు సంప్రదించ

## కైలాసకోన జలపాతంలో పర్యాటకుల వేసవికాలం సందడి...!

### మండుతున్న ఎండలతో సేద తీర్చుకుంటున్న పర్యటకులు



నారాయణవనం, జూన్ 7 ప్రభాతవార్త :

ప్రముఖ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రంగా బాసిల్లుతున్న కైలాసనాధకోనలో ఆదివారం ఇటు భక్తులు అటు పర్యాటకుల సందడితో కిటకిటలాడింది. వేసవి తాపం తీర్చుకోవడం కోసం పర్యాటకులు అధికసంఖ్యలో తరలివచ్చి జలపాతంలో స్నానం చేశారు. ఇకపోతే గత కొద్దిరోజులుగా ఎండలు 41 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరడంతో కోన జలపాతంలో స్నానం చేయడం కోసం వస్తున్నారు. కైలాసకోనతో పాటు శింగిరికోన జలపాతంకు భక్తులు, పర్యాటకులు చేరుతున్నారు. జలపాతంలో స్నానం చేసి మండుతున్న ఎండ నుంచి ఉపసమనం పొందుతున్నారు. స్థానికులతో పాటు తమిళనాడు రాష్ట్రం వందల

## పెనగలూరు ఎస్సైగా అరుణ్ కుమార్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ




పెనగలూరు, జూన్ 7 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండల నూతన ఎస్సైగా అరుణ్ కుమార్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి సైబర్ క్రైమ్ నుంచి పెనగలూరుకు బదిలీ పై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సై రఘురామ్ తిరుపతి వీఆర్ కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## విలువిద్య ఎంపికను ప్రారంభించిన గుడ్లూరు

తొట్టంబేడు, జూన్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా విలువిద్య (ఆర్చరీ) సెలెక్షన్స్‌ను జిల్లా విలువిద్య సంఘం అధ్యక్షులు గుడ్లూరు మల్లికార్జున నాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సెలెక్షన్స్ పీ.ఈ.టి. రమణ, ధనంజయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. గతంలో 2011 వ సంవత్సరం లో రాష్ట్ర సెక్రటరీ చెరుకూరు సత్య నారాయణ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి ఎంజీఎం పాఠశాల లో ప్రారంభించడం జరిగింది. ప్రస్తుతం జరిగిన సెలెక్షన్స్ లో దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గుడ్లూరు మల్లికార్జున నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర విలువిద్య అధ్యక్షులు నందమూరి తేజస్విని ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో ఎన్నో గొప్ప గొప్ప కార్యక్రమాలు చేపడతామని విలువిద్య అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో విలువిద్యకు ప్రత్యేక గుర్తింపు రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విలువిద్య నిర్వాహకులు, కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## వామపక్షాల రాస్తారోకోను జయప్రదం చేయండి

తొట్టంబేడు, జూన్ 7 ప్రభాతవార్త



పెరిగిన గ్యాస్, పెట్రోలు, డీజిల్, నిత్యావసర ధరలకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీన శ్రీకాళహస్తి పట్టణంలో వామపక్ష పార్టీలు తలపెట్టనున్న రాస్తారోకోను జయప్రదం చేయాలని సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో ఆదివారం సిపిఐ, సిపిఎం సంయుక్తంగా రాస్తారోకో కరపత్రాలను ఆవిష్కరించారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో నాలుగు పర్యాయాలు పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగాయని మణి తెలిపారు. కార్పొరేట్ ఆయిల్ కంపెనీలకు రాయితీలిచ్చిన మోడీ ప్రభుత్వం వినియోగదారులపై ధరల భారాన్ని మోపిందని మండిపడ్డారు. అంబానీ, ఆదానీల కోసం మాత్రమే మోడీ ప్రభుత్వాన్ని నడుపుతున్నారనీ, ఫలితంగానే దేశ ప్రజలు ధరల భారాలను మోయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ చేస్తున్న మోసాలను ప్రజలు గమనించాలనీ, స్వచ్ఛందంగా రాస్తారోకోలో పాల్గొని కేంద్రానికి తమ గళాన్ని బలంగా వినిపించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ నేతలు మించల శివకుమార్, గోపి, సిపిఎం నేతలు పెనగడం గురవయ్య, రాధమ్మ, అన్వర్ బాషా, వెంకటేష్, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

## పేకాడుతున్న ఐదుగురు అరెస్టు

శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తికి సమీపంలో విశాలాక్షి నగర్‌కుసమీపంలోని బహిరంగ ప్రదేశంలో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు రూరల్‌సిఐ ఇబ్రహీం వివరించారు. ఆదివారం ఆకస్మికంగా దాడులు జరిపినట్లు వివరించారు. ఇక్కడ పేకాట ఆడుతున్న ఐదు మందిని అదుపులో తీసుకున్నట్లు వివరించారు. వారి నుంచి రూ.4800లు నగదు ఐదు సెల్‌ఫోన్లను రెండు మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

## కొత్త కార్మిక చట్టాలు అమల్లోకి..

### ఉద్యోగులకు రక్షణ, పరిశ్రమలకు వెసులుబాటు

తిరుపతి(లీగల్), జూన్ 7 ప్రభాతవార్త:

భారతదేశంలో బ్రిటిష్ కాలం నుంచి అమలులో ఉన్న కార్మిక చట్టాలను సరళీకరించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 29 పాత కార్మిక చట్టాలను నాలుగు ప్రధాన కార్మిక కోడ్‌లుగా(లేబర్ కోడ్స్) మార్చింది. ఉద్యోగులు, కార్మికులు, యాజమాన్యాలు తప్పని సరిగా తెలుసుకోవాల్సిన కీలక నిబంధనలు ఈ కోడ్‌లలో ఉన్నాయి. వేతనాల కోడ్ 2019 ప్రకారంప్రతి కార్మికుడికి కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం, వేతనాల సకాల చెల్లింపు వంటి హక్కులు కల్పించబడ్డాయి. వేతన నిర్వహచనాన్ని ఏకరీకృతం చేయడం ద్వారా పీఎఫ్, గ్రాట్యుటీ లెక్కింపులో స్పష్టత తీసుకొచ్చారు. సామాజిక భద్రతా కోడ్ 2020 ద్వారా పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ ప్రసూతి ప్రయోజనాలు వంటి సామాజిక భద్రతాపథకాల పరిధిని విస్తరించారు. ముఖ్యంగా గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫాం వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులను కూడా సామాజిక భద్రత పరిధిలోకి తీసుకురావడం విశేషం. పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020 ఉద్యోగ వివాదాల పరిష్కారం, ట్రేడ్ యూనియన్‌ల గుర్తింపు, ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగాలకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించింది. ప్రతి ఉద్యోగికి అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వడం తప్పనిసరి చేయడంతోపాటు కార్మిక యాజమాన్య సంబంధాలను మెరుగు పరిచే చర్యలకు ప్రాధాన్యం ఇచ్చారు. వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020 కార్మికుల భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల మెరుగుదల కోసం రూపొందించబడింది. పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు, ఆరోగ్య పరీక్షలు, మహిళల రాత్రి విధులపై ప్రత్యేక నిబంధనలు ఇందులో ఉన్నాయి. 29 పాత కార్మిక చట్టాలకు బదులుగా నాలుగు సమగ్ర కార్మిక కోడ్‌లను తీసుకురావడంతో దేశ కార్మిక రంగంలో అతి పెద్ద సంస్కరణగా దీనిని భావిస్తున్నారు. వేతనాలు, సామాజిక భద్రత, పారిశ్రామిక సంబంధాలు, కార్మికుల భద్రతకు సంబంధించిన అంశాలను ఒకే వ్యవస్థ కిందకు తీసుకురావడమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశమని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే కొన్ని నిబంధనలు యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్నాయని కార్మిక సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. మరో వైపు పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపుతో పాటు కార్మిక సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ సంస్కరణలు దోహదపడతాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంటోంది.

## బాల్‌బ్యాడ్మింటన్ విజేత శ్రీరంగం టీం

శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ంరెండు రోజుల పాటు జరిగిన బొజ్జల గోపాలకృష్ణారెడ్డి స్మారక బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంటు విజేతలుగా ఓబిబిసి శ్రీరంగం జట్టు విజేతలుగా నిలిచారు. ఈ సందర్బంగా మాజీ మంత్రి గోపాలకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీలు ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహించారు. శ్రీకాళహస్తి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఇన్విటేషన్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ ముగింపు సభకు బొజ్జల బృందమ్మ ముఖ్యఅతిధిగా హాజరై బహుమతులను అందించారు. ఈ సందర్బంగా బృందమ్మ మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో క్రీడాకారులకు కొదవ లేదన్నారు. వారిని ప్రోత్సహించుటకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఎన్నో పథకాలను సాదిస్తున్నారన్నారు. ంరెండు రోజుల పాటు పోటీలను అద్భుతందగా నిర్వహించిన ఆర్గనైజర్‌కు సహాకరించిన కూటమి నాయకులకు క్రీడాకారులను బృందమ్మ అభినందించారు. ఈ పోటీల్లో మొదటి స్థానం ఓబిబిసి శ్రీరంగం, ంరెండవ స్థానం సౌత్ కాస్ట్ రైల్వేస్ ఏ. మూడవ స్థానం జేబిబిసి, నాలగవ స్థానం నంద్యాల, ఐదవ స్థానం శ్రీకాళహస్తి బిబి అసోసియేషన్ క్రీడాకారులు గెల్చుకున్నారు. వారికి బహుమతులను అందించారు.

## నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి



తిరుపతి, జూన్ 7ప్రభాతవార్త:

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు "డయల్ యువర్ సిఎండి" కార్యక్రమాన్ని ఎస్పీడీసీఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్యా, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 8977716661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు.

# బ్రాహ్మణ అట్రాసిటీ చట్ట సాధనే జిల్లా సమితి లక్ష్యం



బ్రాహ్మణ సేవా ప్రముఖులను సన్మానించిన దృశ్యం

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్

తిరుపతి, జూన్ 7 ప్రభాతవార్త :

నానాటికీ బ్రాహ్మణులు ముఖ్యంగా అర్చకులు, హిందు ధర్మంపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో బ్రాహ్మణ అట్రాసిటీ చట్టం సాధించడమే తమ లక్ష్యమని బ్రాహ్మణ సంఘాల సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్ స్పష్టం చేశారు. బ్రాహ్మణులకు ఎక్కడ ఏ అవసరం వున్నా తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవా సమితి ప్రథమ వార్షికోత్సవం ఆదివారం తిరుచానూరు వద్ద కెకె కల్యాణమండపంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నొస్సం నరసింహాచార్య, హరిప్రసాద్‌ల ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. మంత్ర రాజా పీఠం సింహారాశి స్వామి అనుగ్రహ బాషణంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా సంఘం ద్వారా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బ్రాహ్మణులను ఏకం చేయాలనే సంకల్పంతో మొదలుపెట్టిన తన ప్రయాణం రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లో సంఘాలను ఏర్పాటు చేశానని తెలిపారు. త్వరలోనే మదనపల్లిలో కొత్త సమితి ప్రారంభిస్తామన్నారు. బ్రాహ్మణులపై జరుగుతున్న దాడులను ఎదిరించాల్సిన అవసరం వుందని, ఆ మేరకు చట్ట సాధన లక్ష్య దిశగా సమితి నడుస్తుందని తెలిపారు. తిరుపతి సమితి అధ్యక్షుడు డాక్టర్ నరసింహాచార్య మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని సంఘాలను ఏకం చేస్తూ సాగుతున్న సమితి ప్రస్థానం సంతోషకరంగా వుందని పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గాల్లోని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బ్రాహ్మణ సేవా ప్రముఖులను ఘనంగా సత్కరించారు.

### బ్రాహ్మణ సేవా ప్రముఖులకు సన్మానం

శ్రీకాళహస్తి దేవస్థానం విశ్రాంత వేద పండితులు వై.సుబ్రమణ్యం చంద్రశేఖర శాస్త్రి, లక్కీ గ్రూప్ ఆఫ్ ఫౌండేషన్ ఛైర్మన్ అవ్వా సత్యవేంకటేశ్వర రావు, చంద్రగిరిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం అర్చకులు కందావరం శ్రీనివాస భట్టార్, పుత్తూరు పట్టణానికి చెందిన బ్రాహ్మణ సేవకులు కామకోలను కుప్పరాజన్ రమేష్‌కుమార్, తిరుపతికి చెందిన ప్రముఖ జ్యోతిష్కులు డాక్టర్ బుక్కరాయసముద్రం చక్రపాణి, సూళ్లూరుపేటకు చెందిన బ్రాహ్మణ సేవకులు కాదరబాద్ శ్రీనివాసరావులను శాలువా, పూలమాలలు, జ్ఞాపికలను ఘనంగా సన్మానించారు. అలాగే తిరుమలలో లక్షలాది మంది భక్తులకు సేవలందిస్తున్న శ్రీవారి లడ్డు పోటు కార్మిక యాజమాన్యాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా సన్మానం చేశారు. పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు, నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షుడు బాలు స్వామి, అధికార ప్రతినిధి కె.బాలాజీ శర్మ, సాంస్కృతిక కన్వీనర్ లక్ష్మీ రమేష్, ఉపాధ్యక్షుడు రెడ్డి ప్రకాష్, సంయుక్త కార్యదర్శి మహేష్, ఇంకా గంగాధర్‌రావు, మురళి శర్మ, వనం మణికంఠ, బాలాజీరావు, ప్రవీణ్ స్వామి, మదనపల్లి జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, తిరుచానూరు బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, పుత్తూరు, నగరి, తిరుపతి, వెంకటగిరి బ్రాహ్మణ సంఘాల కార్యవర్గం పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## గాంధీపురంలో మాతమ్మ మహోత్సవం

### -భక్తి జల్లు కురిపించిన గ్రామం



తిరుపతిరూరల్, జూన్ 7 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలం పెరుమాళ్ళపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీపురంలో ఆదివారం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. గ్రామ దేవత మాతమ్మ తిరునాళ్ళ సందర్భంగా నిర్వహించిన కొలుపు వేడుకలు ఘనంగా జరిగి భక్తి పారవశ్యానికి నిదర్శనంగా నిలిచాయి. గత నాలుగురోజులుగా గ్రామమంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది. ప్రతి ఇంటా దీపాలంకరణలు, మంగళ వాయిద్యాల నినాదాలు, హారతుల వెలుగులు, ...ఇలా గాంధీపురం భక్తి కాంతులతో కళకళలాడింది. మహిళలు పసుపు, కుంకుమలతో అమ్మవారిని ఆరాధించగా, యువత ఉత్సాహంగా సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆదివారం జరిగిన కొలుపు కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతిరూరల్ అధ్యక్షుడు కొత్తపాటి మునీశ్వరరెడ్డి ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. వీరిని గ్రామస్తులు దుశ్సాలవతో ఘనంగా సత్కరించారు. నాయకులు గ్రామ ప్రజలతో కలిసి పూజల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు. మాతమ్మ జాతర కేవలం ఆచారం మాత్రమే కాక, గ్రామ సంస్కృతి, సంప్రదాయాల ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి ఏడాది మరింత వైభవంగా జరుపుకుంటూ గ్రామస్తులు తమ భక్తి ఐక్యతను చాటుకొంటున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జోగి మోహన్‌కుమార్, బొందు భాస్కర్‌రెడ్డి, కేశవులురెడ్డి, గాంధీపురం లోక, చంద్ర శ్రీను, బాలాజీ పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వేగవంతం

తిరుపతి(లీగల్), జూన్ 7 ప్రభాతవార్త:

దేశంలోని అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ప్రత్యేక సమగ్ర ఓటర్లజాబితా సవరణ) మూడో విడత ప్రక్రియ దేశవ్యాప్తంగా వేగంగా కొనసాగుతోంది. ఓటర్ల జాబితాను శుద్ధి చేసి పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘానికి పూర్తి రాజ్యాంగ బద్ధమైన అధికారాలు ఉన్నాయని సుప్రీం కోర్టు ఇటీవల స్పష్టం చేయడంతో ఈ కార్యక్రమానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. దేశవ్యాప్తంగా సుమారు 3.94 లక్షల మంది బూత్ లెవెల్ అధికారులు ఇళ్ళను సందర్శిస్తూ 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలను క్షేత్ర స్థాయిలో ధృవీకరిస్తున్నారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల భాగస్వామ్యాఇన్న కూడా ఎన్నికల సంఘం ప్రోత్సహిస్తోంది. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 3.42 లక్షల మంది బూత్ లెవెల్ ఏజెంట్లు అధికారులకు సహకరిస్తున్నారు. గతంలో నిర్వహించినరెండో విడత ప్రత్యేక సవరణలో దేశవ్యాప్తంగా సుమారు 10.2 శాతం అక్రమ, డూప్లికేట్ ఓట్లు తొలగించగా, అందులో 60 లక్షల మంది మరణించిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అర్హులైన పౌరులు తమ ఓటును కొత్తగా నమోదు చేసుకోవడానికి, వివరాల్లో మార్పులు చేసుకోవడానికి ఎన్నికల సంఘం సిటిజన్ సర్వీస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

### న తిరుపతి జిల్లాలో ముమ్మరంగా ప్రత్యేక సమగ్ర సవరణ

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాలోను మూడో విడత ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నారు. జిల్లా పరిధిలోని తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు(ఎస్సీ), గూడూరు(ఎస్సీ), సూళ్లూరుపేట(ఎస్సీ), వెంకటగిరి, నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం ఏక కాలంలో కొనసాగుతోంది. డూప్లికేట్ ఓట్లు, మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను ఆధారాలతో పరిశీలించి జాబితా నుంచి తొలగిస్తున్నారు. ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు కూడా అధికారులకు సహకరిస్తున్నారు. కొతనత ఓటర్లకు అవకాశం 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేందుకు ఇది మంచి అవకాశం అని అధికారులు పేర్కొన్నారు. కొత్త నమోదు, మార్పులు లేదా సవరణల కోసం స్థానిక బీఎల్‌వోలను సంప్రదించవచ్చని, అలాగే ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

# 9న బహిరంగ సభను విజయవంతం చేయండి

### - టిడిపి ఉపాధ్యక్షులు నరసింహ యాదవ్



తిరుపతి హెల్త్, జూన్ 7, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మూడు ప్రతిష్టాత్మక బహిరంగ సభలను నిర్వహించాలని కూటమి సమన్వయ కమిటీ నిర్ణయించింది. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ మరియు ఇతర కూటమి నాయకులు పాల్గొంటారని తిరుపతి ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ తెలిపారు నరసింహ యాదవ్ మాట్లాడుతూ తిరుపతి బహిరంగ సభ జూన్ 9వ తేది నిర్వహించనున్నట్లు గత రెండు సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వం పేదలు, వెనుకబడిన వర్గాల కోసం అందించిన వివిధ సంక్షేమ పథకాలు, లబ్ధిని ఈ సభ ద్వారా ప్రజలకు వివరించనున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాలలో (24 నెలలు) సంక్షేమ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. సూపర్ సిక్స్ హామీలతో పాటు సమాజంలోని అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చేలా పలు విప్లవాత్మక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అందించిన ప్రధాన సంక్షేమ పథకాలు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేసిన మొదటి సంతకం పింఛన్ల పెంపుపైనే. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని వృద్ధులు, వితంతువులు, చేనేత, కల్లుగీత కార్మికులు మరియు ఇతర లబ్ధిదారులకు కొండంత అండ లభించిందని తెలిపారు. గతంలో ఉన్న పింఛను రూ. 3,000 నుండి ఒకేసారి రూ.4,000లకు పెంచారు. దివ్యాంగుల పింఛన్: వికలాంగులకు ఇచ్చే పింఛనును రూ. 3,000 నుండి రూ. 6,000లకు పెంచారు అని తెలిపారు. కిడ్నీ, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ఇచ్చే హెల్త్ పింఛన్లను రూ. 10,000 నుండి రూ. 15,000 వరకు పెంచడం జరిగింది. గత రెండేళ్లలో ప్రభుత్వం దాదాపు రూ. 65,887 కోట్లను కేవలం పింఛన్ల రూపంలోనే సుమారు 62.34 లక్షల మంది లబ్ధిదారులకు నేరుగా పంపిణీ చేసింది. దీపం 2.0 (ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం) మహిళల ఆరోగ్యం, పొగలేని వంటగది లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 3 ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నారు. పండగల సమయాల్లో ఈ సిలిండర్లను మహిళల ఖాతాల్లోకి నేరుగా సబ్సిడీ రూపంలో జమ చేస్తున్నాము. తల్లికి వందనం, పాఠశాలలకు వెళ్లే పిల్లల తల్లులను ఆర్థికంగా ఆదుకునేందుకు, డ్రాపౌట్స్ (బడి మానేసే పిల్లల సంఖ్య) తగ్గించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో ప్రతి సంవత్సరం రూ. 13,000 జమ చేస్తున్నాము. విద్యార్థులకు పాఠశాలలో కనీసం 75 శాతం హాజరు తప్పనిసరి చేశాము. అన్నదాత సుఖీభవ రైతులకు పెట్టుబడి సాయం అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ నిధులతో కలుపుకుని, అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ. 20,000 ఆర్థిక సహాయాన్ని పెట్టుబడి సాయంగా అందిస్తున్నారు. పొదుపు సంఘాల మహిళల కూతుళ్ల పెళ్లిళ్ల కోసం రూ. 10,000 నుండి రూ.1 లక్ష వరకు సులభ వాయిదాల రుణ సౌకర్యాన్ని తక్కువ వడ్డీకే కల్పిస్తున్నామని నరసింహ యాదవ్ తెలియజేసారు. రాయలసీమకు చెందిన ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు ఈ బహిరంగ సభలో పాల్గొనబోతున్నారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు.

## ఓటర్ల జాబితా సవరణలో పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొనాలి

### - అడ్వకేట్, టిడిపి మాజీ పార్లమెంట్ అధికార ప్రతినిధి డా.ఎస్. నాగరాజు



వరదయ్యపాలెం, జూన్ 7, ప్రభాతవార్త

భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి కమిటీ సభ్యులు చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ మాజీ అధికార ప్రతినిధి, అడ్వకేట్ డా.ఎస్. నాగరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా పార్టీ శ్రేణులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితా శుద్ధీకరణకు ఎన్నికల సంఘానికి పూర్తి రాజ్యాంగబద్ధమైన అధికారాలు ఉన్నాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలోని తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు వివరాల సవరణ, చిరునామా మార్పులు, డూప్లికేట్ మరియు అనర్హ ఓట్ల తొలగింపు ప్రక్రియలో ప్రజలకు సహకారం అందించాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన యువత తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రతి బూత్ పరిధిలో అర్హులైన వారిని గుర్తించి ఓటర్ల జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులందరూ చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి



పులిచెర్ల, జూన్ 7, ప్రభాతవార్త

మండలంలోని కల్లూరులో చిత్తూరు మార్గంలో కల ఎస్సార్ పెట్రోల్ బంక్ పక్కన గల మామిడికాయల ర్యాంపు వద్ద ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో పాకాలకు చెందిన రాజశేఖర్ మృతి చెందారు. ట్రాక్టర్ డ్రైవ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడడంతో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

# మండుతున్న ఎండలు.. నిర్మానుషంగా మారిన రోడ్లు



జనసంచారం లేని రోడ్డు

రైల్వే కోడూరు జూన్,7 ప్రభాతవార్త

ఎండలు మండుతున్నాయి. జనాలు రోడ్డుక్కడానికి భయపడుతున్నారు. నిత్యం క్షణం తీరికలేకుండా ఇసుకేస్తే రాలని జనాలు, వాహనాలతో ఎప్పుడు రాత్రింభవాళ్లు రద్దీ గా కనిపించే రైల్వే కోడూరు టౌన్ రోడ్డు శనివారం మిట్ట మధ్యాహ్నం జన, వాహనాల సంచారం రాకపోకలు కు నోచుకోకుండా పోయింది. దీంతో టోల్‌గేట్ నుంచి బస్టాండ్ వరకు రద్దీగా ఉండే రహదారి నిర్మానుషంగా కనబడుతుంది. ఎంతో కాలంగా ఎంత మేర మండుటెండలు వచ్చిన, ఏడతేరపి లేకుండా వర్షాలు కురిసిరోడ్ల వెంబడి వర్షపు నీరు ప్రవహించి రోడ్లు వాగులు వంకలు తలపిస్తున్న జన, వాహనాలు సంచారం, రాకపోకలు లేకుండా చూచిన సందర్భంలు దాఖలాలు లేవు. అయితే మండుటెండలు కాచే ఏప్రిల్, మే, మాశాలను కూడా ప్రజలు లెక్క బెట్టలేదు ఎప్పుడు. ఈ ఏడాది మండుటెండలు అధికంగా ఉన్నప్పటికీ రుతుపవనాలు మారే సమయం వచ్చి జూన్ మాసం ఆరంభమై మొదటి వారం ముగుస్తున్న సమయంలో శనివారం కాచిన ఎండలకు రోడ్డుపై తీరుగాడే జనము వ్యాపారులు ఇటువేళ్ళారో తెలియదు గాని జనాలను రోడ్డుకూడా దాటేందుకు నిముషాలు తరబడి వీలులేకుండా పోలీసులు అదుపుకు కూడా ఇబ్బంది కల్గించే విధంగాక్షణం తీరిక లేకుండా తిరిగే బస్సులు, లారీలు, మంగంపేట ముగ్గురాయి తోలే టిప్పర్లు, మరీ ద్విచక్ర వాహనాలు ఎటు పోయాయో తెలియదు గాని సుమారు అరగంట కు పైగా రద్దీగా ఉండే కోడూరు పట్టణ రోడ్డు జన, వాహన సంచారానికి నోచుకోకుండా నిర్మానుషంగా దర్శనం ఇస్తూ జనాలకు అశ్చర్యాన్ని కల్గించింది. దీనిని బట్టి చూస్తే బయట కాచే ఎండలుకు తిరిగేకంటే పొయ్యి సెగన కూర్చున్న కొద్దిరోజులు బ్రతుకు తామేమో గాని ప్రస్తుతం కాస్తున్న మండుటెండ లకు మధ్యాహ్నం సమయంలో రోడ్డుపై కి కాదుకదా ఇంటినుంచి బయటికి వస్తే అంతే సంగతులు తెల్లవారి ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఉక్కతో కూడిన మండుటెండలు కాస్తున్నాయి భానుడు ఉదయం నుంచే ఉగ్రరూపంతో వస్తున్నాడు. ఇప్పటికే అనేక మంది వడ దెబ్బకు మృతి చెందిన దాకలాలు కూడా లేక పోలేదు. ఇంత తీవ్రంగా ఎండలు మండుతూ ప్రజలు బయట తిరగలేక, తిరిగిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతూ అశ్వస్థ కు గురై ప్రాణాలే కోల్పోతుంటే ప్రజల కోసం నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రజాదనాన్ని నెల నెల జీతాల రూపంలో ధోసుకొంటున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఎక్కడున్నారో తెలియదు కనీసం ప్రజలకు ఎండలకు చేయాల్చిన వైద్య సేవలు అంటుంచితే వారికి ఎండలకు తీసుకోవాల్చిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు కూడా ఇచ్చేందుకు నోచుకోలేదని నియోజకవర్గం ప్రజలు ఆరోపిస్తున్నారు. వీటికి నోచుకోక పోవడానికి కారణాలు చూస్తే ప్రభుత్వ డాక్టర్లు ప్రయివేట్ ఆసుపత్రి లు పెట్టుకొని వృత్తిని మరచి ప్రవృత్తి బాటలో సంపాదించే అధిక ఆధాయాల బాటను ఎంచుకోవడమేనని చెపొచ్చు. వీరి పట్ల ప్రభుత్వం ఎప్పుడు కఠినమైన చర్యలు తీసుకొంటుందో కోట్లరూపాయలతో ప్రజల కోసం మెరుగైన వైద్యం అందించేందుకు ఉపయోగ పడతాయోనని కట్టిన భవనాలు ఎప్పుడు వైద్యం అందిస్తాయోనని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

## తిరుపతి జిల్లాలో ఊరిస్తున్న నైరుతి

### -భిన్నవాతావరణంతో జనం ఉక్కిరిబిక్కిరి



ప్రభాతవార్త-తిరుపతి:

జూన్ మొదటివారం వచ్చేసినా ఊరిస్తున్న నైరుతి రుతుపవనాలతో తిరుపతి జిల్లాలో భిన్న వాతావ రణం నెలకొంది. ఓవైపు ఎండవేడికి తట్టుకోలేక సతమతమవుతున్న జనానికి నైరుతి రుతుపవనాలు చల్లటి కబురు చెబుతుందనకుంటే చుక్క వాన కురవడంలేదు. దీంతో జనం ఎండ వేడికి తట్టుకోలేకపోతున్నారు. ఆకాశం మేఘావృతమైనా నైరుతి పలకరించకపోవడంతో వానకోసం రైతులు, జనం ఎదురుచూస్తున్నారు. నిర్థిష్టసమాయానికి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని శాస్త్రవేత్తలు చెబుతున్నా తిరుపతి జిల్లాను పలకరించలేదు. అనుకున్న ప్రకారం నైరుతి అనుకూలిస్తే ముందుగా రాయలసీమను తాకనుందని అంచనా. అయితే ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికీ వర్షాలు కురవకపోడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని చెబుతున్న శాస్త్రవేత్తలు శనివారం కూడా వాన పడకపోవడంతో పరిస్థితి అంచనా వేయలేకపోతున్నారు. శని వారం నుంచి సోమవారం లోపు రుతు పవనాలు ప్రవేశించే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. జూన్ 6 నుండి 8 మధ్య రుతు పవనాలు రాయలసీమలోకి ప్రవేశించే అవకాశం ఉందని అంచనా. ఒకవేళ వాతావరణ పరిస్థితులు అనుకూలించని పక్షంలో వారం రోజుల వరకు ఆలస్యం కావచ్చని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఎండవేడిమి తీవ్రత తగ్గలేదు. పైగా ఆదివారం తిరుపతి జిల్లాలో 42 డిగ్రీలు నమోదవడం విశేషం.

# ఖరీఫ్ రైతు బేజారు!

### - వేరుసెనగ విత్తనం ఎక్కడ!

### - జూన్ నెల ప్రారంభమైనా జాడ కన్పించని సబ్సిడీ విత్తనాలు



చిత్తూరు, జూన్ 7 ప్రభాతవార్త:

జిల్లా రైతాంగం ఖరీఫ్‌లో వర్షాధారంతో వేరుసెగన పంట సాగు చేస్తుండటంతో రైతు వద్ద ఒకరోజు ముందే విత్తనం వుంటే వాతావరణం అనుకూలంగా వున్న సమయానికి విత్తనాలను సిద్దం చేసుకుని విత్తడానికి పూనుకుంటాడు. జిల్లా వ్యాప్తంగా మే నెలలో ముందస్తు వర్షాలు నమోదు కావడంతో ప్రతి ఏడాది వ్యవసాయ శాఖ ఖరీఫ్ సీజన్‌లో పంపిణీ చేసే సబ్సిడీ వేరుసెనగ విత్తనాల కోసం ఎదురు చూడటం ప్రారంభించారు. మే నెల పూర్తయి, ప్రస్తుతం జూన్ నెలలో ఒక వారం రోజులు గడచిపోయినప్పటికీ సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు జాడ మాత్రం కన్పించడం లేదు. ఈ పరిస్థితుల్లో జిల్లాకు ఎప్పుడు సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు వస్తాయి! వాటిని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పుడు పంపిణీ చేస్తారు! అసలు అదనుకు సబ్సిడీ వేరుసెగన విత్తనాలు రైతుకు అందుతాయా! లేదా! అనే ప్రశ్నలు రైతుల నుండి ఉత్పన్నం అవుతున్నాయి. అయితే ఈ ప్రశ్నలకు వ్యవసాయ శాఖ అధికారుల నుండి సరైన సమాధానం మాత్రం వుండటం లేదు. ప్రతి ఏడాది ఖరీఫ్‌లో వ్యవసాయశాఖ రైతులకు సబ్సిడీ ధరతో వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేస్తోంది. ఖరీఫ్‌లో వేరుసెగన వర్షాధారంతో సాగు కావడంతో ఒకొక్కసారి వేరుసెనగ పంట ఆశించిన స్థాయిలో పండకుంటే రైతుల వద్ద విత్తనాలు నిల్వ వుండదు. ప్రతి ఏడాది వ్యవసాయశాఖ సబ్సిడీ ధరలకు వేరుసెగన విత్తనాలు పంపిణీ చేస్తుండటంతో రైతులు సైతం సాధారణంగా తమ వద్ద విత్తనాలు నిల్వ వుంచుకోరు. అయితే వ్యవసాయశాఖ మాత్రం ప్రస్తుతం సకాలంలో వేరుసెనగ విత్తనాలు ఇవ్వకపోవడంతో రైతు పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రస్తుతం జూన్ 8 అయ్యింది. మరో నాలుగైదు రోజులు విత్తనాలు జిల్లాకు వచ్చే అవకాశం లేదు. జిల్లాకు విత్తనాల సరఫరా ప్రారంభం అయితే వచ్చిన విత్తనాలు వచ్చినట్లుగా రైతులకు పంపిణీ చేసే అవకాశం వుండదు. వచ్చిన విత్తనాలను మండల కేంద్రాల్లో నిల్వ చేసి ఆపై రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేయాల్సివుంటుంది. ఖరీఫ్ సీజన్‌లో రైతుకు వ్యవసాయశాఖ సబ్సిడీ ధరలతో 30 కేజీల వేరుసెనగ విత్తనాల బస్తాను రూ.1,700 వరకు తీసుకుని పంపిణీ చేస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో సబ్సిడీ వేరుసెనగ 30 కేజీల బస్తా ధర రూ.1,836గా వ్యవసాయశాఖ నిర్ణయించింది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగా 54 వేల ఎకరాల మేరకు వేరుసెనగ పంట సాగు చేస్తారు. ఈ పరిస్థితుల్లో జిల్లాకు ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం 27,225 వేల క్వింటాళ్ళ వేరుసెగన విత్తనాలను కేటాయించింది. అయితే జిల్లాకు ఇప్పటి వరకు ఒక్క క్వింటాల్ వేరుసెనగ విత్తనం రాకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాకు త్వరగా వేరుసెనగ సబ్సిడీ విత్తనాలను తెప్పించి రైతులకు పంపిణీ చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. జూన్ నెల 15 నాటికి జిల్లాలో సబ్సిడీ వేరుసెనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేయడానికి వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటే రైతుకు కొంత ఉపశమనం కలుగుతుంది.